

జగన్ ఇచ్చిన హామీలను వీడియో క్లిప్పింగ్‌లను చూపిస్తున్న చంద్రబాబు



ప్రభంజనం

'రా కదలిరా!' సభ విజయవంతం

- తండోపతండాలుగా సభకు వచ్చిన పసుపు సైన్యం
- భారీ సంఖ్యలో తరలివచ్చిన మహిళలు, యువకులు
- జయజయ ధ్వానాలు, ఈలలు, కేరింతల హోరు
- స్ఫూర్తి నింపిన చంద్రబాబు ప్రసంగం
- అంబోతుకు కళ్లె వేసి నడిరోడ్డుపై నడిపిస్తా!
- పొన్నూరు 'కిలాడి' గ్రావెల్ రోశయ్యగా మారిపోయాడు
- ఆర్కే మద్దాళిని వాడి పడేసిన పేపర్లా విసిరేశాడు
- స్థానిక వైసీపీ ఎమ్మెల్యేలపై విరుచుకుపడిన చంద్రబాబు

జనం.. జనం.. ఎటుచూసినా ప్రభంజనం.. తండోపతండాలుగా కదలివచ్చిన పసుపు సైన్యం.. సొంతవాహనాలపై స్వచ్ఛందంగా తరలి వచ్చిన ప్రజానీకం.. ఉత్సాహం నింపిన అధినేత ప్రసంగం.. జిల్లాలో 'రా కదలిరా!' సభ ప్రభంజనం సృష్టించింది. ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయకపోయినా, రవాణా సదుపాయాలు సరిపోకపోయినా జనం గ్రామాల నుంచి లక్షలాదిగా తరలివచ్చారు. బైకు ర్యాలీలు పెట్టుకుని కొందరు, ట్రాక్టర్లు కట్టుకుని మరికొందరు సభకు హాజరయ్యారు. టీడీపీ సభలకు సంప్రదాయకంగా వచ్చే పార్టీ శ్రేణులు, రైతులతోపాటు ఈసారి పెద్దసంఖ్యలో మహిళలు, యువకులు హాజరయ్యారు. హాజరవడమే కాకుండా మహిళలు స్ఫూర్తిదాయకంగా చంద్రబాబు ఉపన్యాసానికి బదులిచ్చారు. రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనపై చంద్రబాబు మాట్లాడుతున్నప్పుడు ధీటుగా బదులిస్తూ, సైకో పాలన అంతం చేస్తామంటూ పిడికిళ్లు బిగించి నినాదాలు చేశారు. వేలాదిగా వచ్చిన యువత కట్టుతప్పకుండా క్రమశిక్షణగా సభను నడిపించడమే కాకుండా చంద్రబాబుకు భరోసాను ఇచ్చారు. సభలో భాగంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

గుంటూరు, పొన్నూరు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): పొన్నూరు నియోజకవర్గంలోని వడ్లమూడి గ్రామంలో సోమవారం జరిగిన 'రా కదలిరా!' సభ విజయవంతమైంది. టీడీపీ, జనసేన పార్టీ శ్రేణులు సహా సాధారణ ప్రజలు కూడా తండోపతండాలుగా సభకు రావడంతో సభా ప్రాంగణమంతా కిక్కిరిసిపోయింది. గ్యాలరీలన్నీ నిండిపోయాయి. మధ్యాహ్నం మూడు దాటిందో లేదో వేలాదిగా జనం సభకు తరలివచ్చారు. గుంటూరు పార్లమెంటు పరిధిలోని 7 నియోజకవర్గాల నుంచి వేలాది బైకులతో కార్యకర్తలు తరలిరాగా, సంప్రదాయకంగా వచ్చే రైతాంగం, రైతు కూలీలు ట్రాక్టర్లు కట్టుకుని సభకు చేరుకున్నారు. గుంటూరు, తెనాలి, పొన్నూరు పట్టణాల నుంచి అత్యధిక సంఖ్యలో సభికులు హాజరయ్యారు. సభ ప్రారంభానికి ముందే అందరూ ప్రాంగణానికి చేరుకోవడంతో గ్యాలరీలన్నీ కిక్కిరిసిపోయాయి. ప్రాంగణం సరిపోక బయట రోడ్లపైన నిలబడే పరిస్థితి కనిపించింది. చంద్రబాబు రాకతో సభా ప్రాంగణమంతా జయజయ ధ్వానాలతో, ఈలలతో హోరెత్తింది. చంద్రబాబు వస్తున్న హెలికాప్టర్‌ను చూస్తూ మహిళలు, యువకులు, కార్యకర్తలు పచ్చ కండువాలు, జెండాలు ఊపుతూ అధినేతకు ఘన స్వాగతం పలికారు. ముఖ్యనేతలు హెలిప్యాడ్ వద్దకు వెళ్లి ఆయనను సాదరంగా వేదిక వద్దకు తీసుకువచ్చారు. సభకు టీడీపీ- జనసేన పార్టీల క్యాడర్ పెద్ద సంఖ్యలో హాజరవడంతో ఉత్సాహపూరిత వాతావరణం నెలకొంది.

ఉత్సాహం నింపిన చంద్రబాబు ప్రసంగం..

'మా కన్నాపై దాడి చేయిస్తావా అంబోతు.. ఖబడ్దార్! తోక కట్‌చేస్తా! అంబోతుకు కళ్లెం వేస్తా.. నడిరోడ్డుపై నడిపిస్తా.. అవసరమైతే బట్టలిప్పి తరిమికొడతా!' అంటూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విరుచుకుపడ్డారు. చంద్రబాబు అధి కార వైసీపీ నేతల అరాచకాలపై చంద్ర నిప్పులు చెరిగారు. గుంటూరు పార్లమెంటు పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో వున్న అధికార పార్టీ ఎమ్మెల్యేల అక్రమాలను, అకృత్యాలను లక్షలాదిమంది ప్రజల సమక్షంలో ఎండగట్టడమే కాకుండా, అధికార మదంతో చెలరేగిపోతున్న వారికి తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ముఖ్యమంత్రి వారికి అక్రమాలు చేయడానికి లైసెన్సులు ఇచ్చాడని ఆరోపించారు. ఒక పెద్ద సైకో ఇప్పుడు ఊరికో సైకోని సిద్ధం చేశాడని, వారందరికీ కళ్లెం వేసి దారికి తెచ్చే బాధ్యత టీడీపీ తీసుకుంటుందని భరోసా ఇచ్చారు. 'పొన్నూరు కిలాడి' ఇప్పుడు గ్రావెల్ రోశ య్యగా మారిపోయాడని, సినిమాల్లో కనిపించే కేజీఎఫ్‌ను మించి పొన్నూరు గ్రావెల్ ఫీల్డ్(పీజీఎఫ్) దోపిడీ సాగుతోందని ఆరోపించారు. 700 ఎకరాల్లో 2వేల కోట్ల రూపా యల దోపిడీకి తెరతీశాడని ఆరోపించారు. మాజీ హోంమంత్రి, ప్రత్తిపాడు ఎమ్మెల్యే సుచరిత, వేమూరు ఎమ్మెల్యే, మంత్రి మేరుగ నాగార్జున, చిలకలూరిపేట ఎమ్మెల్యే, మంత్రి విడదల రజినీపై సెటైర్లు వేశారు. ఈ ఊరిలో పనికిరాని చెత్త పక్కూరిలో బంగారమవుతుందని జగన్ అనుకుంటున్నారని, ఆ పప్పులేవీ ఉడకవని ఎద్దేవా చేశారు. 'పాపం మంగళగిరి ఎమ్మెల్యే మనపై కేసులు వేసీ వేసీ.. చివరికి జగన్ చేతిలో మోసపోయాడు' అని అన్నారు. గుంటూరు పశ్చిమలో మన పార్టీలో గెలిచిన ఎమ్మెల్యే ప్లేటు ఫిరాయించి ఇప్పుడు అడ్రసు లేకుండా పోయాడన్నారు. వాడుకుని వదిలేయడంలో జగన్ మించినవారు లేరని మరోమారు జగన్ రుజువు చేశాడు. వాళ్లిద్దరినీ వాడుకుని వేస్టు పేపర్‌లా వదిలేశాడని, వారు అడ్రస్ లేక తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. తెనాలిలో ఎమ్మెల్యే మున్సిపల్ సిబ్బందితో సొంత పనులు చేయించుకుంటున్నాడని, మట్టి, కంకర బొక్కేస్తున్నాడని, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే గంజాయి, గుట్కా వ్యాపారాలతో యువత జీవితాలను నాశనం చేస్తు న్నారని, వీరంతా ఎన్నికల తరువాత తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.



గీతాలు ఆలపిస్తున్న తెలుగు మహిళలు

వైసీపీ అరాచకాలను ఎండగట్టిన టీడీపీ నేతలు

టీడీపీ జిల్లా అధ్యక్షుడు తెనాలి శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రశ్నించడానికి ముందుకు వచ్చిన పవన్ కల్యాణ్‌ను కలుపుకుని చంద్రబాబు 'రా కద లి రా!' పిలుపునిచ్చారని అన్నారు. ప్రతిపక్షాలు ఏమి చేస్తున్నాయి. అధికార పక్షం ఏం చేస్తోంది అనేది ఆలోచించుకుని ప్రజలు ఓట్లేయాలని కోరారు. పొన్నూరు మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ మాట్లాడుతూ టీడీపీతో తన కుటుంబం 40 ఏళ్ల అను బంధం కలిగి వుందన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి చనిపోయే వరకూ తన తండ్రి వీరయ్య చౌదరి పార్టీ సేవకే అంకితమ య్యారని, తాను కూడా కడదాకా పార్టీతోనే వుంటానని చెప్పారు. జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రం కోస మే పవన్ మంచి నిర్ణయం తీసుకున్నారని, ఓటు ను చీలనివ్వకుండా వైసీపీని ఓడించడానికి చంద్రబాబు, పవన్ కలిసి నడుస్తున్నారని, ప్రతిపక్ష ఓటును చీలనీయనన్న పవన్ లక్ష్యాన్ని దెబ్బతీయడానికే కాంగ్రెస్, షర్మిల నాటకమని విమర్శించారు. పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి కోవెలమూడి రవీంద్ర మాట్లాడుతూ ప్రజలంతా ఎన్నికల కోసం కాకుండా స్వాతంత్ర్యం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రత్తిపాడు ఇన్ చార్జి బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ రైతులను, రైతుకూలీలు, దిన కూలీలను, మహిళలు, యువత, ఉద్యోగులు, విద్యార్థులు అందరినీ వంచించిన జగన్‌కు ప్రజల్లో మార్పు చూసి వెన్నులో వణుకు పుడుతుందన్నారు. తూర్పు ఇన్‌చార్జి నసీర్ మాట్లాడుతూ ఎన్టీఆర్ నాడు ఇచ్చిన పిలుపు స్ఫూర్తినందుకుని జనం కదలినట్లు ఇప్పుడు బాబు స్ఫూర్తినందుకుని జనం రాష్ట్రం కోసం, పిల్లల భవిష్యత్తు కోసం కదలిరావాలన్నారు. మంగళగిరి నుంచి రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకీదేవి మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గా లను క్షోభ పెడుతోంది జగన్‌రెడ్డే నన్నారు. మాజీ మంత్రి ఆలపాటి రాజా మాట్లాడుతూ ఉద్యమాల పురుటిగడ్డలో రాజధానిని ఏర్పా టు చేస్తే దానిని జగన్‌రెడ్డి విచ్ఛి న్నం చేశాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ చంద్రబాబు అభివృద్ధితో దేశమంతా రాష్ట్రం వైపు చూసేలా చేశారన్నారు. కార్యక్రమంలో రేపల్లె ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్, పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు, రాజ్యసభ సభ్యుడు కనకమేడల రవీంద్రకుమార్, మాజీ మంత్రులు కన్నా లక్ష్మీనారాయణ, నక్కా ఆనందబాబు, దేవినేని ఉమా మహేశ్వరరావు, నన్నపనేని రాజకుమారి, మాకినేని పెదరత్తయ్య, రాయపాటి శ్రీనివాస్, నేతలు డేగల ప్రభాకర్, కనపర్తి శ్రీనివాసరావు, మన్నవ మోహనకృష్ణ, నిమ్మల శేషయ్య, చిట్టాబత్తిన చిట్టిబాబు, వడ్రాణం మార్కండేయులు, హరిబాబు, నందం అబద్ధయ్య, పాల్గొన్నారు.



చంద్రబాబుతో ఎమ్మెల్యే అనగాని మాటామంతి



ప్రసంగిస్తున్న మాజీ ఎమ్మెల్యే నరేంద్రకుమార్



చంద్రబాబును సన్మానిస్తున్న జనసేన నేతలు



సభలో ముస్లిం మహిళలు



మహిళాభిమానం

నాలా మోసపోవద్దు..

- వైసీపీ నాయకుడు అబ్దుల్లా వినతి

పొన్నూరుటౌన్ (చేబ్రోలు), జనవరి29: తనలా వైసీపీకి ఓటు వేసి నష్టపోవద్దని వైసీపీ నాయకుడు షేక్ అబ్దుల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశాడు. వడ్లమూడిలో జరిగిన



రా కదలిరా టీడీపీ బహిరంగ సభలో ఆయనకు మాట్లాడే అవకాశం కల్పించగా తన కుటుంబం గత ఎన్నికల్లో కష్టపడి పనిచేసి వైసీపీని గెలిపించామని అన్నారు. నాలుగేళ్ల క్రితం తన కుమారుడు రబ్బానీ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడన్నాడు. తన కుమారుడి మృతిపై అనుమానాలు ఉండటంతో ముఖ్యమంత్రికి, డీజీపీకి లేఖలు రాసినా తన గోడు వినేవారే లేరన్నారు. పొన్నూరు ఎమ్మెల్యే వద్దకు వెళ్లి కుమారుడి మృతిపై విచారణ జరపాలని పలుమార్లు కోరినా నిర్లక్ష్యమే కనపడిందన్నారు. డబ్బులు తీసుకొని తన కుమారుడి కేసును ఎమ్మెల్యే మాఫీ చేయించారని తీవ్ర స్థాయిలో ఆరోపించారు. ప్రజలకు రక్షణ ఇచ్చే టీడీపీ పార్టీని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

సభకు వచ్చిన వాహనాలపై రవాణా శాఖ పెనాల్టీ

పొన్నూరుటౌన్ (చేబ్రోలు), జనవరి29: చేబ్రోలు మండలం వడ్లమూడి గ్రామంలో సోమవారం జరిగిన తెలుగుదేశం పార్టీ రా కదలిరా బహిరంగ సభకు వచ్చిన వాహనాలపై రవాణా శాఖ పెనాల్టీలు విధించటం ఆశ్చర్యానికి గురి చేసింది. వడ్లమూడి గ్రామం వద్ద జరిగిన సభకు ప్రజలు పలు జిల్లా నలుమూలల నుంచి బస్సులు, ట్రాక్టర్లు, కారులు, ఇతర రవాణా సౌకర్యాలను ఏర్పాటు చేసుకొని స్వచ్ఛందంగా తరలివచ్చారు. ప్రభుత్వ ఆదేశాలా లేక, వైసీపీ పెద్దలు హుకుం జారీ చేసారో తెలియదు కానీ రవాణా శాఖ అధికారులు, ఈ ప్రైవేటు ఆపరేటర్ల బస్సులను ఆపి భారీ పెనాల్టీ విధించిన్నట్లు సమాచారం. అంతే కాకుండా మార్గంలో లారీలను అడ్డుపెట్టి వాహనాలు అడ్డగించారు. రవాణా శాఖ అధికారులు, పోలీసుల చర్యలతో టీడీపీ శ్రేణులు రోడ్డుపైనే వాహనాలను నిలిపి నిరసనలు వ్యక్తం చేశారు.



కటౌట్‌లు, ఫ్లడ్‌లైట్లు స్టాండ్‌లు ఎక్కిన కార్యకర్తలు



నేనున్నానని..

- నేడు జిల్లాలో నారా భువనేశ్వరి 'నిజంగెలవాలి' పర్యటన
- చంద్రబాబు అరెస్టును తట్టుకోలేక ఆగిన గుండెలు
- వారి కుటుంబసభ్యులకు పరామర్శ, ఆర్థికసాయం

బాపట్ల, జనవరి29(ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్టును తట్టుకోలేక మరణించిన వారి కుటుంబాలకు నేనున్నా ననే భరోసా ఇవ్వడానికి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు సతీ మణి నారా భువనేశ్వరి మంగళవారం జిల్లాలో పర్యటిం చనున్నా రు. నిజంగెలవాలి కార్యక్రమంలో భాగంగా చెరుకుపల్లిలోని ఓ కుటుంబంతో పాటు, పర్చూరు నియోజకవర్గ పరిధిలోని చిననందిపాడు, యద్దనపూడి గ్రామాల్లోని రెండు కుటు ంబాలను భువనేశ్వరి పరామర్శించి వారికి ఆర్థిక సాయం అందించి ధైర్యం చెప్పనున్నారు

పర్యటన సాగేదిలా...


మంగళవారం ఉదయం 11:30కు గన్నవరం విమానాశ్రాయానికి చేరుకోనున్న భువనేశ్వరి అక్కడ నుంచి రోడ్డుమార్గంలో మధ్యాహ్నం 1:50కి చెరుకుపల్లికి చేరుకుని అక్కడ ఓ కుటుంబాన్ని పరామర్శిస్తారు. ఆరుంబాక గ్రామంలో భోజనం చేసి అక్కడ నుంచి పర్యటన కొనసాగిస్తారు. సాయంత్రం 4:30కి పర్చూరు నియోజకవర్గ పరిధిలోని చిననందిపాడు గ్రామానికి చేరుకుని చంద్రబాబు అరెస్టు తట్టుకోలేక మరణించిన వ్యక్తి కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పనున్నారు. అక్కడ నుంచి సాయంత్రం 5:30కి యద్దనపూడి చేరుకుని మరో కుటుంబాన్ని పరామర్శించనున్నారు. చనిపోయిన వారి కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పడంతో పాటు ఒక్కో కుటుంబానికి మూడు లక్షల రూపాయల చొప్పున ఆర్థిక సాయాన్ని ఈ పర్యటనలో భువనేశ్వరి అందించనున్నారు.

ఒక్కొక్కరికి.. రెండు ఓట్లు


- ఈఆర్‌వోకు ఫిర్యాదు చేసిన ఫలితం లేదు
- అధికార పార్టీ నాయకుల ఆదేశాలతోనే తొలగించని వైనం

రేపల్లె, జనవరి 29: తీరప్రాంతంలో ఓటర్ల తుది జాబితా తప్పులు తడకగా మారింది. ఒకే చోట రెండు ఓట్లు ఉన్నా అధికార పార్టీ నాయకుల ఆదేశాలతో బీఎల్‌వోలు దృష్టి సారించలేదని స్థానిక ప్రజలు వాపోతున్నారు. రేపల్లె నియోజకవర్గంలోని నిజాంపట్నంలో ఓటర్ల జాబితాను పరిశీలిస్తే ఒకే ఓటరుకు రెండు చోట్ల చొప్పున 68ఓట్లను గతంలో గుర్తించారు. స్థానిక నాయకులు బీఎల్‌వోకి స్థానిక తహసీల్దార్‌కు రెండు చోట్ల ఓట్లను తొలగించాలని ఫిర్యాదు చేసినా పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇటీవల విడుదల చేసిన తుది ఓటర్ల జాబితాలో సగం పైగానే ఒకే ఓటరుకు రెండు ఓట్లు చొప్పున ఉన్నాయి.


నిజాంపట్నంలో పార్వతీ మోపిదేవికి 140వ బూత్‌లో సీరియల్ నెంబర్ 331, 147వ బూత్‌లో సీరియల్ 303లో ఒకే పేరున రెండు ఓట్లు ఉన్నాయి. ఇదే విధంగా కొక్కిలిగడ్డ నాగరాజుకు 140వ బూత్‌లో సీరియల్ నెంబర్ 218, 150వ బూత్‌లో సీరియల్ నెంబర్ 219లో రెండు ఓట్లు ఉన్నాయి. కొక్కిలిగడ్డ వెంకటేశ్వరమ్మ 140వ బూత్‌లో సీరియల్ నెంబర్ 12 కాగా, 146వ బూత్ సీరియల్ నెంబర్ 977లో రెండు ఓట్లు ఉన్నాయి. బొమ్మిడి వెంకటేశ్వరమ్మ 146వ బూత్‌లో సీరియల్ నెంబర్ 1085లో 141బూత్‌లో సీరియల్ నెంబర్ 920లో రెండు ఓట్లు ఉన్నాయి. బొమ్మిడి తిరుపతమ్మ 143వ బూత్‌లో సీరియల్ నెంబర్ 230, బూత్ నెంబర్147 సీరియల్ 371లో రెండు ఓట్లు ఉన్నాయి. తక్షణమే పరిశీలించి రెం డు ఓట్లు ఉన్నవాటిని తొలగించాలని కోరుతున్నారు.




నిజాంపట్నంలో మోపిదేవి పార్వతీకి రెండు ఓట్లు



వెంకటేశ్వరమ్మ బొమ్మిడికి రెండు ఓట్లు



తిరుపతమ్మకి రెండు ఓట్లు



వెంకటేశ్వరమ్మ కొక్కిలిగడ్డకు రెండు ఓట్లు

అసమానతలకు అద్దం పట్టిన ఆక్స్‌ఫామ్ నివేదిక

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

(నిన్నటి తరువాయి)

పన్నుల నుంచి తప్పించుకొనుట

● ఆర్గనైజేషన్ ఫర్ ఎకనామిక్ కో ఆపరేటివ్ అండ్ డెవలప్‌మెంట్(ఓఈసీడీ) వంటి వాటిలో ఉన్న అనేక దేశాలు 80వ దశకం నుంచి కార్పొరేట్ ట్యాక్స్‌లను సగానికి పైగా తగ్గిస్తూ వచ్చాయి. ప్రపంచీకరణ యుగంలో పెట్టుబడుల ఆకర్షణ కోసం కొన్ని దేశాలు అతి తక్కువ కార్పొరేట్ పన్నులు విధిస్తున్నాయి. మరి కొన్ని దేశాలు ట్యాక్స్ హెవెన్స్‌గా మారాయి. దీని వల్ల పలు దేశాలకు పన్ను రాబడి తగ్గింది. అంతేకాదు, పన్నులు విధిస్తున్న దేశాల్లోని సంపన్నులు పన్నుల ఎగవేతకు పాల్పడడానికి డొల్ల కంపెనీల స్థాపనకు కారణమవుతున్నాయి.

● 1980లో ఓఈసీడీ దేశాల్లో కార్పొరేట్ ఆదాయ పన్ను 48 శాతం ఉండగా 2022 నాటికి అది 23 శాతానికి తగ్గింది. 2020-23 మధ్య కాలంలో 141 దేశాల్లో సర్వే చేయగా 111 దేశాల్లో ఇదే ధోరణి కనిపించింది. ఇదే సమయంలో కార్పొరేట్ల ఆదాయం కొన్ని రెట్లు పెరిగింది. ఈవిధంగా సంపన్నులపై పడని పన్నుల భారం ప్రభుత్వ సంక్షేమ వ్యయాల కోసం సామాన్యులు, పేదలపై పడుతూ ప్రపంచ వ్యాప్తంగా వారి వాస్తవ ఆదాయాలను మరింత తగ్గిస్తోంది.

ప్రభుత్వ రంగ వ్యవస్థల ప్రైవేటీకరణ

● అసమానతలను తగ్గించేందుకు ప్రభుత్వ రంగంలో ఉండాల్సిన విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల్లోకి ప్రైవేట్ రంగాన్ని అనుమతించడంతో వాటిని సైతం కార్పొరేట్స్ లాభార్జన కోసం వినియోగించుకుంటున్నాయి. ప్రపంచ బ్యాంక్ వంటి నిధి వితరణ సంస్థలు కూడా ప్రైవేట్ భాగస్వామ్య పథకాలకు రుణాలు మంజూరు చేస్తూండడంతో పెద్ద ఎత్తున ప్రజాధనం కార్పొరేట్ సంస్థల పెట్టుబడిగా పరిణమిస్తోంది.

● విద్య వంటి ప్రజాశ్రేయస్సు రంగంలో కూడా కార్పొరేట్ ప్రవేశంతో ఆ సేవలు పొందలేని పేదలకు, వాటిని పొందే ధనికులకు మధ్య నైపుణ్యాలు, విద్యా ప్రమాణ పరమైన అంతరాలు మరింత పెరిగి ఆర్థిక అసమానతలను సుస్థిరం చేస్తున్నాయి.

వాతావరణ విఘాతం

● ప్రపంచ కుబేరుల అధీనంలోని అనేక సంస్థలు శిలాజ ఇంధనాలు, ప్రకృతి వనరులను విచక్షణారహితంగా వాడడం వల్ల కర్బన ఉద్గారాలు ఎత్తున విడుదలై పర్యావరణ హననానికి కారణమవుతున్నాయి.

● ప్రపంచ జనాభాలో 2/3 వ వంతు పేదలు విడుదల చేస్తున్న కాలుష్యానికి సమానమైనదాన్ని కేవలం ఒక శాతం ఉన్న సంపన్నులు విడిచి పెడుతున్నారు

సూచించిన పరిష్కారాలు

● ప్రపంచ దేశాల మధ్య ఆదాయ అసమానతల నివారణకు ఐక్యరాజ్యసమితి, జీ 20 వంటి వేదికల ద్వారా గ్లోబల్ రూల్స్-విధానాల రూపకల్పనకు కృషి జరగాలి.

● కార్పొరేట్ శక్తులకు దీటుగా ప్రభుత్వ రంగం విద్య, వైద్యం, మౌలిక సేవల రంగాల్లో పునరుత్తేజం తేవాలి.

● ప్రజా రవాణా, పునరుత్పాదక శక్తి వనరులు, రుణ వితరణ రంగాల్లో కార్పొరేట్ నియంత్రణ శక్తులకు ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం అందుబాటులో ఉండాలి. మార్కెట్ నియంత్రణ, ధరల నియంత్రణకు ప్రభుత్వ వ్యవస్థల పాత్ర, పరిధి పెరగాలి.

● ప్రభుత్వ రంగ సంస్థల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెంచాలి.

● పేటెంట్ రూల్స్‌ను సరళీకరించి గుత్తాధిపత్య ధోరణుల స్థానంలో ప్రజాస్వామ్యయుత ఉద్యమతత్వం, వాణిజ్యం పాదుకొల్పాలి.



● కార్మికుల, మహిళల, అణగారిన వర్గాల సాధికారతకు; పర్యావరణ పరిరక్షణకు; అసమానతల నిర్మూలనకు కార్పొరేట్ సెక్టార్ దోహదపడేలా ప్రభుత్వ చర్యలు ఉండాలి.

● ట్రేడ్ యూనియన్ల ఏర్పాటు, పర్యావరణ డ్యూ డెలిజెన్స్, మానవ హక్కుల అమలు దిశగా ప్రభుత్వాలు చట్టాలను, విధానాలను రూపొందించాలి.

● సీఈఓ, యాజమాన్య లాభాలు, ప్రతిఫలాలపై క్యాపింగ్ విధించడం; కార్పొరేట్ ఆదాయ పన్ను పెంచడం, పర్మనెంట్ యాక్సెస్ ప్రాఫిట్ ట్యాక్స్, పర్మనెంట్ వెల్త్ ట్యాక్స్ విధించడం వంటి చర్యలు చేపట్టాలి.

● ప్రజలలో ఉద్యమతత్వం పెంచడం, సహకార సంఘాల ఏర్పాటు, చిన్న సంస్థలకు రుణ వితరణ పెంచడం, లాభాల్లో ఉద్యోగులకు వాటాలనిచ్చే న్యూ జనరేటివ్ కంపెనీల ప్రోత్సాహం, కనీసం జీవన వేతనాలను ఇచ్చే సంస్థలకే ప్రభుత్వ కాంట్రాక్ట్‌లు ఇవ్వడం, అంతర్జాతీయ ద్రవ్య సంస్థల నిధులు వెచ్చించే ప్రాజెక్టుల్లో బహుళ జాతి కంపెనీలు చొరబడకుండా చూడడం, పన్నులు సక్రమంగా చెల్లించే సంస్థలకు ప్రభుత్వం ప్రాధాన్యమివ్వడం వంటి చర్యల ద్వారా ఆర్థిక అసమానతలు తగ్గించేందుకు దోహదపడవచ్చు.

ఆక్స్‌ఫామ్ ఇండియా రిపోర్ట్: సర్వైవల్ ఆఫ్ ద రిచ్చెస్ట్-ద ఇండియా స్టోరీ'

భారతీయ ఆర్థిక అసమానతలపై ఆక్స్‌ఫామ్ ఇండియా విడుదల చేసిన నివేదిక- లింగ, వర్గ, ప్రాంతాలపరంగా పేద-ధనిక వ్యత్యాసాలను విశ్లేషించింది. అసమానతల్లో ఇటీవలి ధోరణులు, వాటికి కారణాలు, నివారణ చర్యలు కూడా పేర్కొంది.

భారత్‌లో ఆర్థిక అసమానతల తీరు

● దేశ సంపదలో 60 శాతం వరకు కేవలం అయిదు శాతం మంది సంపన్నుల చేతిలో కేంద్రీకృతం కాగా ఆర్థికంగా దిగువన ఉన్న 50 శాతం మంది చేతిలో 3 శాతం సంపద మాత్రమే ఉంది.

● 2020-22 మధ్య రెండేళ్లలో భారత బిలియనీర్ల సంఖ్య 102 నుంచి 166కు పెరిగింది. ఇదే సమయంలో ప్రపంచంలోనే అత్యధికమంది(228.9 మిలియన్లు) పేదలు భారతదేశంలో ఉన్నారు.

● 2012 నుంచి 2023 మధ్య కాలంలో భారతదేశంలో సృష్టించిన సంపదలో 40 శాతం దేశంలోని ఒక శాతం సంపన్నుల చేతుల్లోకి చేరగా కేవలం 3 శాతం సంపద ఆర్థికంగా దిగువన ఉన్న 50 శాతం మంది జనాభా చేతుల్లోకి చేరింది.

● దేశంలోని వందమంది అత్యంత సంపన్నుల సంపద విస్తృతంగా 660 బిలియన్ డాలర్లు/54.12 లక్షల కోట్లుగా ఉంది. ఇది ఏడాది కాలానికి సరిపోయే దేశ బడ్జెట్ నిధులకు సమానం.

● భారతదేశంలో 2018 నుంచి 2022 మధ్య పేదల సంఖ్య మాత్రం 190 మిలియన్‌ల నుంచి 350 మిలియన్‌లకు పెరిగింది. 2022లో అయిదేళ్లలోపు బాలల మరణాల్లో 65 శాతం కేవలం పేదరికం, పోషకాహార లోపం వల్ల సంభవించాయి.

● కరోనా విజృంభించిన సమయంలో దిగువ 50 శాతం మంది జనాభా తమ సంపదలో క్షీణతను చవి చూశారు. 2020 జాతీయాదాయంలో వారికి దక్కింది కేవలం 13 శాతం మాత్రమే. ఇది వారిపై రుణభారం పెరగడానికి, పోషకాహార లోపానికి, అనారోగ్య మరణాలకు దారితీసింది. ఇదే సమయంలో ఎగువ 30 శాతం మంది సంపన్నులు 90 శాతం సంపదను చేజిక్కించుకున్నారు. మరీ ముఖ్యంగా ఎగువ 10 శాతం మంది సంపన్నుల చేతిలో 80 శాతం సంపద కేంద్రీకృతం కాగా ఎగువ 5 శాతం మంది సంపన్నుల చేతిలో అయితే దేశ సంపదలో సగానికిపైగా అంటే 62 శాతం వరకు వచ్చి చేరింది. ఇక టాప్ ఒక శాతం మంది సంపన్నుల చేతిలో కేంద్రీకృతమైన సంపదను దిగువ 50 శాతం మంది ప్రజల మొత్తం సంపదతో పోలిస్తే 13 రెట్లు ఎక్కువగా ఉంది. అంటే మొత్తం దేశ సంపదలో 40.6 శాతం వరకు కేవలం ఒక శాతం టాప్ సంపన్నుల చేతిలో ఉంది.

● ఈ ఆర్థిక అసమానతల ధోరణులు కరోనా సమయంలో మరింత పెరిగాయి. కరోనా విజృంభణ నుంచి 2022 నవంబరు వరకు బిలియనీర్ల సంపద 121 శాతం పెరిగింది. అంటే రోజుకు 3,608 కోట్ల రూపాయాల సంపద జమ అయింది.

లింగ, సామాజిక అసమానతలు

● భారతీయ పురుష కార్మికులు సంపాదించే ప్రతి రూపాయి వేతనానికి మహిళ కార్మికులు కేవలం 60 పైసలు మాత్రమే సంపాదిస్తున్నారు. ఈ వ్యత్యాసాలు గ్రామీణ, షెడ్యూల్డ్ క్యాస్ట్ వర్గాల్లో అధికంగా ఉన్నాయి. పట్టణ, ఉన్నత వర్గాలు పొందుతున్న ఆదాయాల్లో గ్రామీణులు 55 శాతం, షెడ్యూల్డ్ క్యాస్ట్‌ల వారు సగం కన్నా తక్కువే పొందుతున్నారు.

ఆర్థిక అసమానతలు పెరగడానికి కారణాలు

● భారతదేశంలో 2019లో కార్పొరేట్ పన్ను శ్లాబ్‌ను 30 శాతం నుంచి 22 శాతానికి తగ్గించారు. కొత్త పరిశ్రమలపై మరింత తక్కువగా 15 శాతం పన్ను విధించారు. ఈ కొత్త పన్ను విధానాల వల్ల దేశం 1.84 లక్షల కోట్ల రూపాయలు కోల్పోయింది. అయితే ఆదాయం పెంచుకోవడానికి కేంద్ర ప్రభుత్వం జీఎస్‌టీని; పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ డ్యూటీలను పెంచడం వల్ల ఈ పరోక్ష పన్నులు సామాన్యులపై ఆర్థిక భారాన్ని మోపాయి.

● ఆదాయంలో శాతంగా చూసుకుంటే భారతదేశంలో దిగువ 50 శాతం మంది ప్రజలు, టాప్ 10 శాతం మంది సంపన్నులతో పోలిస్తే ఆరు రెట్లు ఎక్కువ పన్ను చెల్లిస్తున్నారు.

● ఆహార, ఆహారేతర పదార్థాలపై విధించే పన్నుల్లో 64 శాతం వరకు దిగువ 50 శాతం జనాభా నుంచే సమకూరుతోంది.

● ప్రభుత్వానికి జీఎస్‌టీ ఆదాయాలపరంగా చూస్తే 2/3 వంతుకు కొద్దిగా తక్కువ భాగం దిగువ 50 శాతం మంది నుంచి; 1/3 శాతం వరకు మధ్య 40 శాతం జనాభా నుంచి సమకూరుతుండగా టాప్ 10 శాతం మంది నుంచి కేవలం మూడు శాతం నుంచి నాలుగు శాతం వరకు లభిస్తోంది.

● ఈ విధంగా సంపన్నుల సంపదపై కన్నా సామాన్య పేద వర్గాల ఆదాయాలపై పన్నులు అధికంగా ఉండి వారి తలసరి వ్యయార్హ ఆదాయం తగ్గి ఆదాయ అంతరాలు మరింత పెరుగుతున్నాయి.

● భారతదేశంలోని బిలియనీర్ల మొత్తం సంపదపై ఒకసారి రెండు శాతం పన్ను విధించినట్లయితే వచ్చే 40,423 కోట్లతో దేశంలోని పోషకాహార లోపంతో బాధపడుతున్న బాలలకు మూడేళ్ల పోషకాహారాన్ని అందించవచ్చు.

● అదేవిధంగా దేశంలో అత్యంత సంపన్న వ్యక్తి గౌతమ్ అదానీపై 2017-21 మధ్య అన్ రియలైజ్డ్ గెయిన్స్‌పై ఒకసారి పన్ను విధించడం ద్వారా వచ్చే 1.79 లక్షల కోట్లతో దేశంలోని 50 లక్షల ప్రైమరీ స్కూల్ టీచర్లకు ఏడాదిపాటు ఉపాధి, వేతనాలు ఇవ్వొచ్చు.

● టాప్ 10 బిలియనీర్లపై 5 శాతం చొప్పున పన్ను విధిస్తే షెడ్యూల్డ్ ట్రైబ్‌ల ఆరోగ్య సంరక్షణపై అయిదేళ్లకు ఖర్చయ్యే మొత్తం లభిస్తుంది.

భారత్‌లో అసమానతల నిర్మూలనకు ఇచ్చిన సూచనలు

● దేశంలోని సంపన్నుల నికర సంపదపై శాశ్వత ప్రాతిపదికన పన్నులు విధించాలి. విధాన రూపకర్తలను ప్రభావితం చేయగల సంపన్న వర్గాలు మరింత సంపన్నులుగా మారే విషవలయాన్ని ఛేదించాలి.

● సామాన్యులు వినియోగించే కనీసావసర వస్తువులపై జీఎస్‌టీ పన్ను స్లాబ్‌లను తగ్గించడం, విలాస వస్తువులపై భారీగా పన్నులు విధించడం ద్వారా పేదలపై పన్ను భారం తగ్గి ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుంది.

● వైద్య రంగంపై 2025 నాటికి జీడీపీలో 2.5 శాతం బడ్జెట్ కేటాయింపులు చేయాలి. అదేవిధంగా విద్యపై 6 శాతం కేటాయించాలి. విద్యా-వైద్య సౌకర్యాలు విస్తరింపజేయాలి. పేద, అణగారిన వర్గాలు, మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేయాలి.

● దేశంలోని అవ్యవస్థీకృత ఆర్థిక రంగంలో ఉన్న 90 శాతం శ్రామిక శక్తి ఆకస్మిక ఆర్థిక ఒడుదొడుకులను, ద్రవ్యోల్బణాలను తట్టుకొనే స్థితిలో లేనందున వారికి సాంఘిక భద్రత కల్పించడం సహా పర్యవేక్షణ, ట్రి కింగ్, పరిరక్షణ విధానాల ద్వారా వారిని ఆదుకోవాలి.



ఎం.బాలలత, సివిల్స్ మెంటార్

దిక్సూచి DIKSUCHI

ఏపీ అంబేద్కర్ గురుకులాల్లో ఇంటర్ ప్రవేశాలు

తాడేపల్లిలోని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ (ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్)- రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న డా.బీ.ఆర్.అంబేద్కర్ గురుకులాలు, ఐఐటీ-మెడికల్ అకాడమీల్లో ఇంటర్ ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. బీఆర్ఏజీ ఇంటర్ సెట్ 2024 ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. విద్యార్థులు సొంత జిల్లా గురుకులంలో ప్రవేశానికి మాత్రమే అప్లయ్ చేసుకోవాలి. అభ్యర్థి కోరుకున్న గ్రూప్ అక్కడ లేని పక్షంలో సంబంధిత జోన్ పరిధిలోని మరో జిల్లా గురుకులానికి అప్లయ్ చేసుకోవచ్చు. దరఖాస్తును ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన తరవాత మార్పులకు అవకాశం లేదు. ఎంపికైన అభ్యర్థులకు విద్య, వసతి ఉచితం. క్రీడలకు ప్రాధాన్యమిస్తారు.

సీట్లు: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 164 గురుకులాల్లో ఎంపీసీ 5400, బైపీసీ 5400, ఎంఈసీ 800, సీఈసీ 1600, హెచ్ఈసీ 360 సీట్లు ఉన్నాయి.

● ఐఐటీ-మెడికల్ అకాడమీల్లో మొత్తం 600 సీట్లు ఉన్నాయి. వీటిలో ఎంపీసీ, బైపీసీ గ్రూప్‌లకు సమానంగా ఒక్కోదానిలో 300 సీట్లు కేటాయించారు. కృష్ణా జిల్లా-ఈడ్పుగల్లులోని బాలికల అకాడమీలో ఎంపీసీ, బైపీసీ గ్రూప్‌లకు ఒక్కోదానిలో 160 సీట్లు ఉన్నాయి. కర్నూలు-చిన్నటేకూర్‌లోని బాలుర అకాడమీలో ఒక్కో గ్రూప్‌లో 60 సీట్లు, గుంటూరు-అడవితక్కెళ్లపాడు బాలుర అకాడమీలో ఒక్కో గ్రూప్‌లో 80 సీట్లు ఉన్నాయి.

అర్హత: ప్రస్తుతం పదోతరగతి పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. తెలుగు మీడియంలో చదివినవారు కూడా అర్హులే. అభ్యర్థుల వయసు 2024 ఆగస్టు 31 నాటికి 17 ఏళ్లు మించకూడదు. ఇప్పటికే ఈ గురుకులాలల్లో చదువుతున్నవారికి ఒక ఏడాది సడలింపు వర్తిస్తుంది. కుటుంబ వార్షిక ఆదాయం రూ.1,00,000 లోపు ఉండాలి.

ఏపీ బీఆర్ఏజీ ఇంటర్ సెట్ 2024: దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. మొత్తం 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నలన్నీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్దేశించిన పదోతరగతి సిలబస్ ఆధారంగానే ఉంటాయి. మేథమెటిక్స్ నుంచి 25; ఫిజికల్ సైన్స్, బయలాజికల్ సైన్స్, సోషల్ స్టడీస్, ఇంగ్లీష్(కాంప్రహెన్షన్ అండ్ గ్రామర్), లాజికల్ రీజనింగ్ సబ్జెక్టుల నుంచి ఒక్కోదానిలో 15 ప్రశ్నలు ఇస్తారు. అభ్యర్థులు సమాధానాలను బ్లూ/బ్లాక్ పెన్‌తో ఓఎంఆర్ పత్రం మీద గుర్తించాలి. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. సమాధానం తప్పుగా గుర్తిస్తే పావు మార్కు కోత విధిస్తారు. మొత్తం మార్కులు 100. పరీక్ష సమయం రెండున్నర గంటలు. ప్రశ్నలు తెలుగు, ఇంగ్లీష్ మాధ్యమాల్లో ఉంటాయి.


● ఏపీ బీఆర్ఏజీ ఇంటర్ సెట్ 2024లో సాధించిన మెరిట్ ఆధారంగా ఐఐటీ - మెడికల్ అకాడమీల్లో ప్రవేశానికి షార్ట్‌లిస్ట్ రూపొందిస్తారు. వీరికి మాత్రమే మరో ఎంట్రెన్స్ టెస్ట్ నిర్వహిస్తారు.

- దరఖాస్తు ఫీజు లేదు
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 23
- **ఏపీ బీఆర్ఏజీ ఇంటర్ సెట్ 2024 తేదీ:** మార్చి 10
- **ఐఐటీ-మెడికల్ అకాడమీల్లో ప్రవేశానికి టెస్ట్ తేదీ:** ఏప్రిల్ 21
- **వెబ్‌సైట్:** https://apbragcet.apcfss.in

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/Pb1Zvp3లో చదవండి.

నవ్య చిత్రజ్యోతి

మరో 200 రోజుల్లో...



అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో రూపొందిన 'పుష్ప ది రైజ్' చిత్రం సంచలన విజయం సాధించిన విషయం విదితమే. 2021లో బిగ్గెస్ట్ బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది ఆ చిత్రం. అల్లు అర్జున్ కెరీర్‌లోనే ఇది అతి పెద్ద విజయం కాగా, ఈ సినిమాతోనే ఆయన జాతీయ స్థాయిలో ఉత్తమ నటుడిగా అవార్డ్ పొందారు. దీనికి సీక్వెల్‌గా 'పుష్ప 2 ది రూల్' రూపొందుతోంది. ఈ సినిమా ఎప్పుడెప్పుడు విడుదలవుతుందా అని ఆసక్తిగా ఎదురు చూస్తున్న ప్రేక్షకులలో చిత్ర యూనిట్ ఇటీవల విడుదల తేదీ ప్రకటించి జోష్ పెంచింది. తాజాగా సోమవారం మరో ఇంట్రెస్టింగ్ అప్‌డేట్‌ను నిర్మాతలు ఇచ్చారు. మరో రెండు వందల రోజుల్లో 'పుష్ప 2' వస్తుందంటూ ప్రత్యేక పోస్టర్ విడుదల చేశారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15న ప్రపంచ వ్యాప్తంగా ఈ సినిమాను విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ శరవేగంతో జరుగుతోంది. రష్మిక మందన్న హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో ఫహాద్ ఫాజిల్, ధనుంజయ్, సునీల్, అనసూయ తదితరులు నటిస్తున్నారు. నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ నిర్మాతలు.



సమస్యలు చెప్పాం... పరిష్కారాలూ చెప్పమన్నారు

దిల్‌రాజు

'పరిశ్రమలోని సమస్యల గురించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిగారితో గంట పదిహేను నిమిషాల పాటు నిర్మాతలందరం కలిసి చర్చించడం జరిగింది. సమస్యలేకాదు, పరిష్కారాలు కూడా మీరే చెప్పండి.. ప్రభుత్వం నుంచి ఏం కావాలన్నా చేయడానికి సిద్ధంగా ఉన్నామని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు.' అని దిల్ రాజు చెప్పారు. సోమవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలుగు ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ దిల్ రాజు మాట్లాడారు. 'పరిశ్రమలోని సమస్యలపై ఎల్లుండి ఈసీ మీటింగ్ పెడుతున్నాం. సమస్యల పరిష్కారాలతో త్వరలోనే మళ్లీ సీఎంని కలుస్తాం. ఎల్లుండి నిర్వహించే ఈసీ మీటింగ్‌లో తీసుకోబోయే నిర్ణయాలు రాబోవు తరాలకు వారధిలా ఉంటాయి.' అని దిల్‌రాజు తెలిపారు. ఇంకా చెబుతూ 'ఛాంబర్ నిర్ణయాన్ని గౌరవిస్తూ సంక్రాంతి బరి నుంచి తొలగిన 'ఈగల్' చిత్రం ఫిబ్రవరి 9న విడుదల కానుంది. పీపుల్‌మీడియా టి.జి.విశ్వప్రసాద్, వివేక్, హీరో రవితేజగార్లకు ఈ సందర్భంగా కృతజ్ఞత తెలియజేస్తున్నాం. అదే రోజున 'ఊరుపేరు భైరవకోన' సినిమా డేట్‌ను కూడా ఎనౌన్స్ చేశారన్న విషయం ఛాంబర్ దృష్టికి రాగానే, నిర్మాతలు అనిల్ సుంకర, రాజేష్‌గార్లతో మాట్లాడటం జరిగింది. చాంబర్ వినతిని మన్నించి వాళ్లు కూడా తమ సినిమా డేట్‌ని ఫిబ్రవరి 16కు మార్చుకున్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఫిబ్రవరి 9న విడుదల కానున్న 'ఈగల్' సినిమాకు ఎక్కువ థియేటర్లు వచ్చేలా చూస్తాం' అని దిల్‌రాజు తెలిపారు. 'అదే డేట్‌లో 'యాత్ర 2' రిలీజ్‌ను కూడా ఫిక్స్ చేశారు. అయితే, రాజకీయ కారణాల దృష్ట్యా ముందే డేట్ ఫిక్స్ చేసుకోవడం చేత, వాళ్లు విడుదల తేదీ మార్పుకు అంగీకరించలేదు. అలాగే, రజనీకాంత్ ప్రత్యేక పాత్ర పోషించిన 'లాల్ సలామ్' కూడా అదే డేట్‌లో విడుదల కానుంది. ఈ విషయంపై పీపుల్‌మీడియా ఫ్యాక్టరీ వాళ్లతో చర్చిస్తే, ఆ రెండు సినిమాలవల్ల తమకు ఇబ్బంది లేదని వాళ్లు చెప్పారు' అని దిల్‌రాజు తెలిపారు. ఇంకా ఈ సమావేశంలో ఫిల్మ్ ప్రొడ్యూసర్ కౌన్సిల్ ప్రెసిడెంట్ వి.దామోదరప్రసాద్, సెక్రటరీ టి.ప్రసన్నకుమార్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ ప్రతినిధి వివేక్ కూచిభొట్ల తదితరులు మాట్లాడారు.

కొరటాలకు సుప్రీంకోర్టులో చుక్కెదురు



కథల కాపీరైట్స్ అంశంపై చిత్రపరిశ్రమలో వివాదాలు తలెత్తడం పరిపాటే. దాసరి నారాయణరావు దర్శకత్వం వహించిన 'గోరింటాకు'(1979) చిత్ర కథ విషయంలోనూ గతంలో ఇటువంటి వివాదమే చోటుచేసుకుంది. కథ నాదేనంటూ రచయిత్రి రంగనాయకమ్మ, 'గోరింటాకు' చిత్ర కథారచయిత్రి రామలక్ష్మిపై కోర్టుకు వెళ్లారు. చివరకు ఆ కేసులో రంగనాయకమ్మ విజయం సాధించారు. దాదాపు అలాంటి వివాదమే మహేశ్‌బాబు 'శ్రీమంతుడు'(2015) సినిమా విషయంలో కూడా ఎనిమిదేళ్లుగా జరుగుతోంది. 'శ్రీమంతుడు' కథ తనదేనని, స్వాతి పత్రికలో ప్రచురితమైన తన కథను కాపీ చేసి 'శ్రీమంతుడు' సినిమా తీశారని శరత్‌చంద్ర అనే రచయిత అప్పట్లో సినీరచయితల సంఘానికి ఫిర్యాదు చేశారు. పరిశ్రమ పెద్దల దృష్టికి కూడా ఈ విషయాన్ని తీసుకెళ్లారు. న్యాయం జరిగేలా లేదని మీడియా ముందు కూడా తన గోడును వెల్లబోసుకున్నారు. చివరకు నాంపల్లి కోర్టును ఆశ్రయించారు. పిటీషన్‌పై విచారణ జరిపిన కోర్టు కొరటాలపై చర్యలు తీసుకోవాలంటూ ఆదేశించింది. దాంతో కొరటాల తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. శరత్‌చంద్ర చూపిన ఆధారాలను నిర్ధారిస్తూ రచయితల సంఘం ఇచ్చిన నివేదనకు పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు, నాంపల్లి కోర్ట్ ఉత్తర్వులను సమర్థించడంతో కొరటాలకు సుప్రీంకోర్ట్ మెట్లెక్కక తప్పలేదు. ఇప్పుడు అక్కడ కూడా కొరటాలకు చుక్కెదురైంది. కొరటాల శివ దాఖలు చేసిన పిటీషన్‌పై జస్టిస్ హృషికేశ్, జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా ధర్మాసనం విచారణ చేపట్టింది. సినిమా విడుదలైన 8 నెలల తర్వాత శరత్‌చంద్ర కోర్టును ఆశ్రయించారని, హైకోర్టు, స్థానిక కోర్టు తమ వాదనలను ఎక్కడా పరిగణనలోకి తీసుకోలేదని కొరటాల తరఫున న్యాయవాదైన వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ నిరంజన్‌రెడ్డి వాదనలను వినిపించగా, సుప్రీం ధర్మాసనం ఆ వాదనలను తోసిపుచ్చింది. రచయితల సంఘం నివేదిక ఆధారంగానే హైకోర్ట్ నిర్ణయం తీసుకుందని, పిటీషనర్ కొరటాల పిటీషన్‌ని పరిగణనలోకి తీసుకొని తదుపరి విచారణ జరిపేందుకు కూడా ఏమీ లేదని సుప్రీం స్పష్టం చేసింది. 'పిటీషన్‌ను వెనక్కి తీసుకుంటారా? మమ్మల్నే డిస్మిస్ చేయమంటారా?' అని ధర్మాసనం కొరటాల తరపు న్యాయవాది నిరంజన్‌రెడ్డిని ప్రశ్నించింది. తామే పిటీషన్‌ను వెనక్కి తీసుకుంటాం అని నిరంజన్‌రెడ్డి చెప్పడంతో సుప్రీం కోర్టు అనుమతి మంజూరు చేసింది.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/8M2yIAe లో చదవండి.

ఉత్తమ నటుడు రణబీర్, ఉత్తమ నటి అలియా

● 12th ఫెయిల్ చిత్రానికి ఆరు అవార్డులు

● కలర్‌ఫుల్‌గా జరిగిన ఫిల్మ్‌ఫేర్ అవార్డుల వేడుక







బాలీవుడ్ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావించే ఫిల్మ్‌ఫేర్ అవార్డుల వేడుక ఆదివారం సాయంత్రం గుజరాత్‌లో కలర్‌ఫుల్‌గా జరిగింది. 2023లో విడుదలైన చిత్రాలకు సంబంధించి విజేతలకు అవార్డులు అందించారు. గత ఏడాది 'పఠాన్', 'జవాన్', 'దంకీ' చిత్రాల వరుస విజయాలతో ముందంజలో ఉన్న షారుఖ్‌ఖాన్ పేరు ఉత్తమ నటుడిగా నామినేషన్స్ లిస్ట్‌లో ఉన్నా, ఫైనల్‌గా మాత్రం 'యానిమల్' లో అద్భుతంగా నటించిన రణబీర్ కపూర్ కు అవార్డ్ దక్కింది. ఈ సినిమా మీద ఎంత కాంట్రవర్సీ వచ్చినా ఘన విజయం సాధించడం గమనార్హం. ఉత్తమ నటుడు అవార్డ్‌తో పాటు మరో మూడు అవార్డులు ఈ చిత్రానికి దక్కాయి. షారుఖ్ ఖాన్ 'జవాన్' చిత్రం యాక్షన్, వీఎఫ్ఎక్స్ లకు మాత్రం రెండు అవార్డులతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. బెస్ట్ యాక్టర్‌గా నామినేట్ అయిన మరో హీరో విక్కీ కౌశల్ 'దంకీ' చిత్రంతో ఉత్తమ సహాయ నటుడి అవార్డ్ పొందారు. ఇక 'రాకీ ఔర్ రాణీకి ప్రేమ్ కహానీ' సినిమాలో అత్యుత్తమ నటన ప్రదర్శించిన అలియా భట్ ఉత్తమ నటి పురస్కారం పొందారు. ఈ సినిమాలోనే నటించిన షబానా అజ్మీ ఉత్తమ సహాయ నటి అవార్డ్ సాధించారు. ఇటీవల విడుదలైన విజయం సాధించిన '12th ఫెయిల్' ఉత్తమ చిత్రంగా ఎన్నిక కావడమే కాకుండా మరో ఐదు అవార్డులు పొందింది. ఈ చిత్రానికి దర్శకత్వం వహించిన విధు వినోద్ చోప్రా ఉత్తమ దర్శకుడిగా ఎన్నికయ్యారు. మనోజ్ వాజ్‌పేయి నటించిన 'జోరామ్' క్రిటిక్స్ బెస్ట్ ఫిల్మ్ అవార్డ్ పొందింది. డేవిడ్ ధావన్‌ను జీవిత సాఫల్య పురస్కారంతో సత్కరించారు. తారల తళుకు బెళుకులు, నృత్యాలతో ఆద్యంతం ఆసక్తికరంగా ఈ వేడుక సాగింది.



తుళ్లూరు రైతు ధర్నా శిబిరంలో బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేస్తున్న రైతులు, మహిళలు

రాజధాని అమరావతిని నిర్వీర్యం చేశారు

● 1504వ రోజుకు చేరుకున్న రైతుల ఆందోళనలు

తుళ్లూరు, జనవరి 29: వైసీపీ ప్రభుత్వం ఇచ్చేది గోరంత పన్నుల బాదుడుతో తీసుకునేది కొండంత అని రాజధాని అమరావతికి 33వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు పేర్కొన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్, జై ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు సోమవారం నాటికి 1504వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి వారు మాట్లాడుతూ రాష్ట్ర రాజధానికి ప్రత్యేక హోదా తీసుకొస్తామని చెప్పిన సీఎం జగన్‌రెడ్డి మూడు రాజధానులని హోదాను పడేకేయించారని అన్నారు. దాని గురించి ప్రజలు నోళ్ల మూయించటానికి మూడు ముక్కల ఆట పెట్టారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో మూడు ప్రాంతాలు అభివృద్ధి చెందాలంటే కేంద్రం నుంచి ప్రత్యేకహోదా తేవాలన్నారు. వేల ఎకరాలిస్తే అమరావతి అభివృద్ధి కొనసాగించక పోవటం సిగ్గు చేటన్నారు. రాష్ట్ర రాజధానికి జీవనాధారమైన భూములిస్తే నిర్మాణాలు కొనసాగించకుండా మూడు ముక్కలతో అన్నదాతను నాలుగున్నర ఏళ్ళ నుంచి అష్టకష్టాలు సీఎం జగన్‌రెడ్డి పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వార్షిక కౌలు కూడా ఇవ్వకుండా కోర్టు చుట్టూ తిప్పుతున్నాడన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. జయహో అమరావతి, జై ఆంధ్ర ప్రదేశ్ అంటూ నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాలలో ఆందోళనలు కొనసాగాయి.

దేగల ప్రభాకర్ భారీ ర్యాలీ

బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న దేగల ప్రభాకర్



గుంటూరు, జనవరి (ఆంధ్రజ్యోతి) 29: 'రా కదలిరా!' బహిరంగ సభ సందర్భంగా టీడీపీ నగర అధ్యక్షుడు దేగల ప్రభాకర్ ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన పార్టీ శ్రేణులు సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు. 300 మోటార్ సైకిళ్లు, 50 కార్లతో భారీ ర్యాలీగా పొన్నూరు నియోజకవర్గం వడ్లమూడి సభకు తరలివెళ్లారు. కొత్తపేట ఎన్టీఆర్ విగ్రహానికి, బస్టాండ్ సర్కిల్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఈ సందర్భంగా ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా దేగల ప్రభాకర్ మాట్లాడుతూ 'రా కదలిరా!' కార్యక్రమాన్ని చూసి జగన్ వెన్నులో వణుకు పుడుతోందన్నారు. జగన్ అరాచకాలను భూస్థాపితం చేయడానికి ప్రజలు సిద్ధంగా వున్నారన్నారు.

క్రీడాకారులతో.. తొండాట!

● ఆడుదాం ఆంధ్రా క్రీడాకారులకు మొండిచేయి
● విజేతలకు తొలుత రూ.35 వేలన్నారు.. ఇప్పుడేమో రూ.25 వేలేనట?
● అది కూడా అకౌంట్లో వేస్తామంటున్నారు
● ఎంపీడీవో కార్యాలయం వద్ద క్రీడాకారుల నిరసన



నగదు ఎందుకు ఇవ్వరంటూ ఎంపీడీవో కె.శివపార్వతిని నిలదీస్తున్న గెలుపొందిన క్రీడాకారులు

రేపల్లె, జనవరి 29: ఆడుదాం ఆంధ్రా క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు నగదు బహుమతి ఇవ్వాల్సి ఉండగా, మాకు నిధులు రాలేదంటూ అధికారులు చేతులు ఎత్తేయడంతో విజేతలు ఎంపీడీవో కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఎంపీడీవో కె.శివపార్వతిని క్రీడాకారులు నిలదీశారు. నిజాంపట్నం మండలానికి చెందిన క్రీడాకారులు 24వతేదీన జరిగిన వాలీబాల్ ఫైనల్స్‌లో ప్రథమస్థానం సాధించారు. నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడల్లో గెలుపొందిన వారికి ఒక్కొక్క జట్టుకి మెడలు, ప్రశంసా పత్రం రూ.35వేలు నగదు బహుమతి ఇవ్వాల్సి ఉంది. అయితే గెలుపొందిన జట్లకు ప్రశంసా పత్రం, మెడల్ మాత్రమే ఇస్తామంటూ అధికారులు తెలపటంతో క్రీడాజట్లు నిరాశకు లోనయ్యారు. గెలుపొందిన క్రీడాకారులైన బొమ్మిడి శ్రీనివాసరావు, సికనం శేషగిరి, భూషణం, మౌనిక, మానస, శివపార్వతి, మరికొంతమంది క్రీడాకారులు మాట్లాడుతూ కష్టపడి గెలిస్తే ప్రభుత్వం ఈవిధంగా మోసం చేస్తుందని అనుకోలేదన్నారు. మూడు పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు ఒక్కో ఆటకి రూ.35వేలు చొప్పున లక్షా ఐదు వేలు రావాల్సి ఉందని కానీ ఒక్క రూపాయి కూడా ఇచ్చిన దాఖలాలు లేవని క్రీడాకారులు ఆరోపించారు. ఈ విషయమై ఎంపీడీవో కె.శివపార్వతిని అడగ్గా ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి రూ.25వేలు మాత్రమే మంజూరు చేశామని నగదు బహుమతి తర్వాత ఇస్తామని తెలిపారు. ఆధార్‌కార్డు, బ్యాంకు అకౌంట్ ఇస్తే త్వరలో మీ అకౌంట్‌లలో నగదు బదిలీ అవుతుందని క్రీడాకారులకు తెలిపారు.

నియంతృత్వ అధికారులు ఇకనైనా పద్ధతి మార్చుకోవాలి



● మాజీ ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల, జనవరి29: పల్నాడులో పనిచేస్తున్న కొందరు పోలీసు అధికారులు నియంతృత్వ ధోరణి ఇకనైనా మానుకొని చట్టప్రకారం నడుచుకుంటే అభ్యంతరం వుండదని గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టి శారీరకంగా హింసకు గురిచేసిన అధికారులను కచ్చితంగా గుర్తుంచుకుంటామన్నారు. రేపటి ఎన్నికల్లో టీడీపీ, జనసేన ప్రజాప్రభుత్వం ఏర్పాటయ్యాక ఇప్పుడు నియంతలా వ్యవహరించిన కొందరు అధికారులు మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. వెల్దుర్తిలో ఒకమత్స్యకార సామాజికవర్గానికి చెందిన వ్యక్తి పోలీసుల అక్రమ కేసులకు భయపడి చనిపోవడం బాధాకరమన్నారు. తొండపిలో ఆదివారం రాత్రి మాజీమంత్రి కన్నా లక్ష్మీనారాయణపై వైసీపీ గూండాలు దాడి చేయడాన్ని కూడా యరపతినేని ఖండించారు. సత్తెనపల్లి డీఎస్పీ ప్రోద్బలంతోనే ఇవన్నీ జరుగుతున్నాయని టీడీపీ కార్యకర్తల నుంచి వినిపిస్తుందన్నారు. తొండపి, వెల్దుర్తి ఘటనలపై, జూలకంటి బ్రహ్మారెడ్డిపై తప్పుడు కేసులను ఖండిస్తున్నామని యరపతినేని తెలిపారు. జగన్‌ను ఓడించి ఇంటికి పంపేందుకు రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారని యరపతినేని శ్రీనివాసరావు మరో ప్రకటనలో తెలిపారు. ఎన్నికలకు ఇక 74 రోజులు మాత్రమే సమయం వుందని, వైసీపీ దురాగతాలకు ప్రజాకోర్టులో శిక్ష పడే సమయం ఆసన్నమైందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అన్నివిధాల నాశనం చేసిన వైసీపీ పార్టీ ప్రజలకు అవసరం లేదనేది అర్థమవుతుందని తెలిపారు. ఐదేళ్లలో జగన్మోహన్‌రెడ్డి ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తిచేయకపోగా, టీడీపీ అధికారంలో వుంటే సాగునీటి ప్రాజెక్టులన్నీ పూర్తయ్యేయన్నారు.

ఆడుదాం ఆంధ్రాలో బాహాబాహి

● న్యాయ నిర్ణేతలను దూషించిన క్రీడాకారులు





క్రీడా మైదానంలో విరిగిన కుర్చీలు, మైదానంలో పోలీసుల బందోబస్తు

కొల్లూరు, జనవరి 28: ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు బాహాబాహికి దారి తీశాయి. సోమవారం కొల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరుగుతున్న ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీల్లో క్రీడాకారులు న్యాయ నిర్ణేతను ధూషించి చొక్కా పట్టుకున్న సంఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అమృతలూరు, చుండూరు మండలాల జట్లు ఖోఖో పోటీల్లో తలపడ్డాయి. ఆట ప్రారంభం నుంచే చుండూరు జట్టు క్రీడాకారులు దురుసుగా ప్రవర్తిస్తూ పేచీలు పెట్టడంతో న్యాయ నిర్ణేతలు ఇది తగదని వారించిన వినకపోవడంతో ఆటను నిలిపివేసి ఆ జట్టు కెప్టెన్ నిర్ణయం మేరకు అమృతలూరు జట్టును విజేతగా ప్రకటించారు. అనంతరం చుండూరు జట్టు క్రీడాకారులు న్యాయ నిర్ణేతలను పరుష పదజాలంతో ధూషిస్తూ గొడవకు దిగారు. దీంతో క్రీడలను తిలకించేందుకు వచ్చిన వారు ఇది తగదని వారించినా వినకపోవడం పైగా న్యాయ నిర్ణేతలను చొక్కా పట్టుకోవడంతో సహించలేని జనం చుండూరు జట్టు క్రీడాకారులకు దేహశుద్ధి చేశారు. న్యాయ నిర్ణేతలు జోక్యం చేసుకుని వారిని క్రీడా మైదానం నుంచి బయటకు పంపి వేశారు. చుండూరు జట్టు క్రీడాకారులు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి జరిగిన గొడవ గురించి పోలీసులకు వివరించారు. స్పందించిన ఎఎస్‌ఐ రామయ్య ఇరువురు పోలీసులను వెంట పెట్టుకుని క్రీడా మైదానంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

వైకుంఠపురం బ్యారేజ్‌తో కృష్ణా డెల్టా స్థిరీకరణ



చంద్రబాబుకు వినతిపత్రం అందచేస్తున్న సాగునీటి వినియోగదారుల సంఘాల నాయకులు

పొన్నూరుటౌన్ (చేబ్రోలు), జనవరి 29: వైకుంఠపురం బ్యారేజ్‌తో కృష్ణా డెల్టా ఆయకట్టు స్థిరీకరించాలని సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య నాయకులు చంద్రబాబుకు వినతిపత్రం సమర్పించారు. సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల వెంకటగోపాలకృష్ణారావు మాట్లాడుతూ కృష్ణా, పశ్చిమ డెల్టా వైసీపీ ప్రభుత్వంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైందని ఆరోపించారు. టీడీపీ హయాంలో ప్రాజెక్టుల నిర్మాణం శరవేగంగా సాగితే వైసీపీ ప్రభుత్వం ప్రాజెక్టుల నిర్మాణాన్ని పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. టీడీపీ-జనసేన ఉమ్మడి ప్రభుత్వంలో వైకుంఠపురం వద్ద పది టీఎంసీల నిల్వ సామర్థ్యంతో బ్యారేజిని నిర్మించాలని విజ్ఞప్తిచేశారు. ఈ నీటి ద్వారా కృష్ణ, గుంటూరు, ప్రకాశం, పశ్చిమ గోదావరి జిల్లాల్లో 13 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరించటమే కాక అమరావతి రాజధానికి పుష్కలంగా తాగునీరు అందే అవకాశం ఉందని వారు చంద్రబాబు దృష్టికి తెచ్చారు.

ప్రతి ఒక్కరిపై దైవాశీస్సులు

● మహోత్సవాల కన్వీనర్ శామ్యూల్ కిరణ్
● ముగిసిన బైబిల్ మహోత్సవాలు





బైబిల్ మిషన్ మహోత్సవాల్లో ప్రసంగిస్తున్న అధ్యక్షుడు జే శామ్యూల్ కిరణ్, ప్రార్థనలకు హాజరైన భక్తులు

పెదకాకాని, జనవరి 29: గత నాలుగు రోజులుగా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుట జరుగుతున్న బైబిల్ మిషన్ 86వ మహోత్సవాలు సోమవారం ముగిశాయి. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా భారతదేశంలోని అనేక రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు సోమవారం జరిగిన ముగింపు ప్రార్థనలో బైబిల్ మిషన్ అధ్యక్షులు, మహోత్సవాల కన్వీనర్ రెవరెండ్ జె.శామ్యూల్ కిరణ్ మాట్లాడుతూ దేవుని ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని కోరారు. దేవుని కృపతో బైబిల్ మిషన్ దినదినాభివృద్ధి చెందుతుందని తెలిపారు. వచ్చే ఏడాది నుంచి మహోత్సవాల నిర్వహణ విషయంలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ మేధస్సు)ను అమలు పరచాలని భావిస్తున్నట్లు తెలిపారు. ఎంతో కాలం నుంచి చలువ పందిళ్ళలో మహోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. భక్తుల ఆరోగ్యం దృష్టిలో ఉంచుకొని ఎలాంటి రసాయనాలు మిళితం కాని బియ్యాన్ని ఆహారంగా వినియోగిస్తున్నట్లు తెలిపారు. అపరిమితమైన విశ్వాసంతో హాజరవుతున్న ప్రతి ఒక్కరికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. బైబిల్ మిషన్ మహోత్సవాలు విజయవంతంగా జరిగినందుకు ఫిబ్రవరి నాలుగో తేదీన విజయోత్సవ సభ నిర్వహిస్తున్నట్లు కిరణ్ పేర్కొన్నారు. మహోత్సవాలకు సహకరించిన అన్ని కమిటీలు, ప్రభుత్వ శాఖలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. మహోత్సవాల్లో అనేకమంది పాస్టర్లు సందేశాన్ని అందజేశారు. భక్తులు తమ స్వస్థలాలకు తరలివెళ్లారు. వారి కోసం ఆర్టీసీ, రైల్వే ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేశాయి.

అగ్నిబాధిత రైతులను పట్టించుకోరా?

● పసుపు రైతుల సదస్సులో టీడీపీ, రైతుసంఘాల నాయకులు



అగ్నిప్రమాద బాధిత రైతుల సదస్సులో మాట్లాడుతున్న మాజీమంత్రి నక్కా ఆనందబాబు

దుగ్గిరాల, జనవరి 29: దుగ్గిరాలలోని శుభం మహేశ్వరి కోల్డ్‌స్టోరేజి అగ్నిప్రమాద బాధిత రైతులకు పరిహారం అందించే వరకూ బాధిత రైతులకు తోడుగా నిలబడతామని మాజీమంత్రి నక్కా ఆనందబాబు అన్నారు. ఈనెల 19న స్థానిక కోల్డ్‌స్టోరేజిలో జరిగిన అగ్నిప్రమాదంలో నష్టపోయిన రైతులకు అండగా సోమవారం ఏర్పాటు చేసిన సదస్సులో ఆనందబాబు పాల్గొన్నారు. కోట్లాదిరూపాలయ నష్టం జరిగితే మంత్రులు, ముఖ్యమంత్రి కార్యాలయంలో అధికారులు ఏంచేస్తున్నారని ప్రశ్నించారు. లక్షా 15వేల బస్తాల పసుపు అగ్నికి ఆహుతై రూ.120 కోట్ల నష్టమని ప్రాథమిక అంచనా వేస్తున్నారన్నారు. ఏడెనిమిదేళ్లుగా పసుపునకు గిట్టుబాటు ధరలేక పోవడంతో కోల్డ్‌స్టోరేజిలో పంటనిల్వలు విక్రయించుకోలేదన్నారు. నేటివరకూ అద్దె, బీమా చెల్లిస్తున్నప్పటికీ రైతుల నష్టం ఏవిధంగా చెల్లిస్తారో చెప్పాలన్నారు. ప్రస్తుతం క్వింటాల్‌కు రూ.10వేల నుంచి రూ.12వేల వరకూ పలుకుతోందని, అమ్ముకుం దామనుకునే లోపే ప్రమాదం చోటు చేసుకోవడం దురదృష్టకరమన్నారు. యజమాని సైతం కాలినగాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, 10రోజులైనప్పటికీ అధికారులెవ్వరూ కనీసం పరామర్శించిన దాఖలాల్లేవన్నారు. సీపీఐ రాష్ట్రసహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ, రైతులకు ఆపదవస్తే పార్టీలకతీతంగా ఆదుకోవాల్సిన ప్రభుత్వం నేటివరకూ స్పందించక పోవడం దురదృష్టకరమన్నారు. రైతుసంఘ రాష్ట్రప్రధాన కార్యదర్శి కేవీ ప్రసాద్, పసుపు రైతుల రేపల్లె మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని వెంకటసుబ్బయ్య, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుసంఘ రాష్ట్రకార్యదర్శి పి.జమలయ్య, గుంటూరు మిర్చియార్డు మాజీచైర్మన్ మన్నవ సుబ్బారావు, జిల్లా సీపీఐ కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, పసుపు రైతుసంఘ అధ్యక్షుడు యార్లగడ్డ వెంకటేశ్వరరావు, రైతుసంఘ కార్యదర్శి పచ్చల శివాజీ, కొల్లి రంగారెడ్డి, యార్లగడ్డ శివయ్య, పలువురు బాధిత పసుపురైతులు, రైతుసంఘాల నాయకులు పాల్గొన్నారు.

కన్నాపై దాడిచేసిన దుండగులను కఠినంగా శిక్షించాలి

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు



నరసరావుపేట టౌన్, జనవరి 29: మాజీమంత్రి కన్నా లక్ష్మీనారాయణపై దాడిచేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు సోమవారం ఓ ప్రకటనలో అన్నారు. ముప్పాళ్ళ మండలం తొండేపిలో ఆదివారం మాజీమంత్రి కన్నా లక్ష్మీనారాయణ, మరికొందరు టీడీపీ కార్యకర్తలపై జరిగిన రాళ్ళ దాడిని తీవ్రంగా ఖండించారు. మంత్రి అంబటి రాంబాబు ప్రోత్సాహంతో వైసీపీ దుండగులు ఈ బరితెగింపునకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. బాబు ష్యూరిటీ, భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించగా సభకు ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి కన్నా హాజరుకావటం జరిగిందన్నారు. గ్రామంలో వైసీపీ నుంచి పలువురు టీడీపీలో చేరుతుండటం జీర్ణించుకోలేక వైసీపీ మూకలు మంత్రి అంబటి ప్రోత్సాహంతో రాళ్లదాడికి తెగబడ్డారని అన్నారు. పోలీసుల సమక్షంలోనే సభ జరుగుతున్న ప్రాంతంలో ముందుగానే పథకం ప్రకారం వైసీపీ దుండగులు లైట్లు ఆర్పి భవనాలపై నుంచి ఒక్కసారిగా రాళ్ల వర్షం కురిపించి దాడికి పాల్పడడం అత్యంత దుర్మార్గమని చెప్పారు. రాళ్లదాడిలో కన్నా లక్ష్మీనారాయణ పీఏ స్వామికి తీవ్రగాయాలు కాగా, శ్రీధర్, మాజీ ఎంపీపీ పచ్చల నాగేశ్వరరావు గాయపడటం జరిగిందన్నారు. రాళ్ళ దాడికి పాల్పడిన వైసీపీ దుండగులపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నేడు జడ్పీ స్థాయి సంఘ సమావేశాలు

గుంటూరు సిటీ, జనవరి 29: జడ్పీ 10వ స్థాయి సంఘ సమావేశాలు మంగళవారం ఉదయం గుంటూరు జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయం నందు నిర్వహించనున్నారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా, జెడ్పీ సీఈవో జె.మోహన్‌రావు అధ్యక్షతన సమావేశాలు జరగనున్నాయి.

వైసీపీ రౌడీలు.. గూండాల పార్టీ అని మరోసారి నిరూపితమైంది

● మాజీ మంత్రి కన్నా రాళ్ళ దాడిని ఖండించిన ప్రత్తిపాటి

చిలకలూరిపేట అర్బన్, జనవరి 29: వైసీపీ అంటేనే రౌడీలు, గూండాలు, గంజాయి బ్యాచ్ పార్టీ అని మరొకసారి నిరూపితమైందని మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు ధ్వజమెత్తారు. మంత్రి అంబటి ప్రోద్బలంతో వైసీపీ గూండాలు గంజాయి, మత్తు, అధికార మదంతో తొండపిలో కన్నాపై చేసిన హత్యాయత్నమే ఇందుకు నిదర్శనమన్నారు. పోలీసుల సమక్షంలోనే దాడి జరగటం, కనీసం వారు అడ్డుకొనే ప్రయత్నం కూడా చేయకపోవటం రాష్ట్రంలో జరుగుతున్న వైసీపీ అరాచక పాలనకు అద్దం పడుతోందని సోమవారం ఒక ప్రకటనలో ప్రత్తిపాటి ఆగ్రహం వ్యక్తం చేశారు. రౌడీయిజం, భౌతికదాడులతో ప్రతిపక్షాలను భయపెట్టాలని చూస్తున్నారన్నారు. ఈ ఘటనకు మంత్రి అంబటి, స్థానిక పోలీసు అధికారులే బాధ్యత వహించాలన్నారు. ఇదే సమయంలో మాచర్ల నియోజకవర్గంలో పోలీసులే వైసీపీలో చేరికల కోసం పనిచేస్తుండటం విస్తుగొలుపుతుందన్నారు. వెల్దుర్తి ఎస్ఐ శ్రీహరి అరాచకాలకు ఒక మత్స్య కార్మికుడు బలికావటం కలచివేసిందన్నారు. టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటు చేయటం ఖాయమని ప్రత్తిపాటి పేర్కొన్నారు.

పల్నాడు ఎస్పీని సస్పెండ్ చెయ్యాలి

- కాపు ఉద్యమ నేత వేల్పూరి

గుంటూరు సిటీ, జనవరి 29: ప్రతిపక్ష పార్టీల నేతల సభలు, సమావేశాలకు సరైన భద్రత కల్పించే విషయంలో పూర్తిగా విఫలమైన పల్నాడు జిల్లా ఎస్పీని వెంటనే సస్పెండ్ చేయాలని సౌత్ ఇండియన్ కాపు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వేల్పూరి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రి, టీడీపీ నేత కన్నా లక్ష్మీనారాయణపై వైసీపీ గుండాలు దాడి చేస్తుంటే పోలీసులు చూస్తూ కూర్చోవడం దారుణమని అన్నారు. రాష్ట్ర కాపునాడు అధ్యక్షుడు సంకటి లక్ష్మణరావు మాట్లాడుతూ రాష్ట్రంలో గూండారాజ్యం నడుస్తోందన్నారు. జనసేన, టీడీపీ పొత్తుకు కాపు సంఘాలు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు వారు ప్రకటించారు.

ఉభయ రామేశ్వర క్షేత్రం దర్శించనున్న భువనేశ్వరి

కొల్లూరు, జనవరి 28: నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా చెరుకుపల్లి పర్యటన చేస్తున్న నారా చంద్రబాబు నాయుడు సతీమణి భువనేశ్వరి కొల్లూరు మండలం చిలుమూరులోని ఉభయ రామేశ్వర క్షేత్రాన్ని మంగళవారం సందర్శించనున్నట్లు మండల పార్టీ అధ్యక్షులు మైనేని మురళీకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గన్నవరం ఎయిర్‌పోర్టు నుండి రోడ్డు మార్గాన తాడేపల్లి నుంచి కరకట్ట మీదుగా ఉదయం 10 గంటలకు కొల్లూరు మండలం చిలుమూరులోని ఉభయ రామలింగేశ్వర స్వామి ఆలయంలో నారా భువనేశ్వరి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం రోడ్డు మార్గాన కొల్లూరు, భట్టిప్రోలు మీదుగా చెరుకుపల్లి చేరుకుంటారన్నారు. టీడీపీ, జనసేన కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని చిలుమూరులో స్వాగతం పలికి భట్టిప్రోలు వరకు జరిగే ర్యాలీని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

తొండపిలో పోలీసు పికెటింగ్

సత్తెనపల్లి జనవరి 29: ముప్పాళ్ళ మండలం తొండపిలో వైసీపీ కార్యకర్తలు ఆదివారం రాత్రి టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ కాన్వాయ్‌పై రాళ్ళ దాడి చేసిన నేపథ్యంలో సోమవారం గ్రామంలో పోలీసు పికెట్ కొనసాగుతోంది. ముందస్తు చర్యలలో భాగంగా గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు పికెట్ నిర్వహిస్తున్నారు. గ్రామంలో టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ ఫ్లెక్సీని కూడా చించివేశారు. ఒక పథకం ప్రకారం ఈ రాళ్ళ దాడి జరిగిందని టీడీపీ శ్రేణులు ఆరోపిస్తున్నాయి. పోలీసుల సమక్షంలోనే జరిగిన రాళ్ళ దాడిని టీడీపీ శ్రేణులు తీవ్రంగా పరిగణిస్తున్నాయి.

ఇరువర్గాలపై కేసులు నమోదు

ముప్పాళ్ళ జనవరి 29: మండలంలోని తొండపిలో వైసీపీ కార్యకర్తలు ఆదివారం రాత్రి బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ కాన్వాయ్‌పై, రాళ్ళ దాడిచేసిన వారిపై తొండపి గ్రామ, మండల టీడీపీ నాయకులు సోమవారం ఫిర్యాదు చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు బత్తుల నాగేశ్వరరావు న్యాయవాది, టీడీపీ నాయకులు పూజల వెంకటకోటయ్య, అబ్దుల్ మజీద్, రావిపాటి మధుబాబు, నానయ్య, రాయిడి అప్పారావు బాషా, గుత్తా రామారావు, కొల్లా యుగంధర్, తెల్లజర్ల వెంకటేశ్వర్లు, అత్తోట వెంకటకృష్ణ పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. తొండపిలో జరిగిన గొడవలో ఇరువర్గాల ఫిర్యాదుల మేరకు ఇరువర్గాలపై కేసులు నమోదు చేసినట్లు ముప్పాళ్ళ ఎస్ఐ హజరతయ్య సోమవారం తెలిపారు.







తొండపిలో ఏర్పాటుచేసిన పోలీసు పికెటింగ్, వైసీపీ కార్యకర్తలు విసిరిన రాళ్ళు, చించివేసిన టీడీపీ ఫ్లెక్సీ

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.30 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	119, 127, 138
చికెన్ విత్ స్కిన్	226.00
చికెన్ స్కిన్ లెస్	236.00

గుంటూరు మిర్చియార్డులో ధరలు ఇలా...

గుంటూరు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 1,05,823 టిక్కీల మిర్చి విక్రయానికి రాగా అందులో 98,079 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్‌కమిటీ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 67,096 టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఇలా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			సూపర్ 10	--	--
334	9000	20000	నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
నెంబరు. 5	13000	9000	తేజ	8000	21500
273	14000	15200	బ్యాడిగి	10500	20000
341	11000	20000	దేవనూరు డీలక్స్	11000	18000
4884	11000	15000	తెల్లకాయలు	5000	13000

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె


రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న న్యాయవాదులు

ల్యాండ్ టైట్లలింగ్ యాక్ట్‌ను రద్దు చేయాలి

రేపల్లె, జనవరి 11: టైటలింగ్ యాక్ట్ 27/22 చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని రేపల్లె బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాది దారం సాంబశివరావు అన్నారు. సోమవారం రేపల్లె బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద న్యాయవాదులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు 26వ రోజుకు చేరాయి. ఈ దీక్షల్లో న్యాయవాదులు ఆళ్ళ సూరిబాబు, డీ.ఉదయ్, శంకర్, కేసన జగదీష్, యడ్ల గోపిరాజు, దీపాల ప్రసాద్‌లు కూర్చున్నారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక చట్టాలతో న్యాయస్థానాల మనుగడ ప్రశ్నార్థకమవుతుందన్నారు. ప్రభుత్వం తన నిర్లక్ష్య వైఖరిని వీడి ల్యాండ్ టైట్లింగ్ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేసన గోపాలరావు, న్యాయవాదులు జీ.వెంకటేశ్వరరావు, ఆర్.నాగరాజు, పి.శ్రీనివాసరావు .కె.సంజయ్, పి.నాగాంజనేయులు, ఆళ్ళ సూరిబాబు, కొలుసు రామారావు పాల్గొన్నారు.

బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో

జాతీయ సదస్సు ప్రారంభం

బాపట్ల, జనవరి 29 : బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో మూడురోజుల జాతీయ సదస్సు సోమవారం ప్రారంభించారు. రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో సినర్జీస్ ఇన్ కెమిస్ట్రీ, మెటీరియల్ సైన్స్ క్వాంటమ్ కంప్యూటర్స్ 2024 అనే అంశంపై నిర్వహించిన ఈ సదస్సును బాపట్లఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షకార్యదర్శులు ముప్పలనేని శ్రీనివాసరావు, మానం నాగేశ్వరరావులు జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. తదుపరి సావనీరు ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సదస్సు పరిశోధకులకు, విద్యార్థులకు విజ్ఞానాన్ని పెంపొందిస్తుందన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్.నజీర్ మాట్లాడుతూ ఈ రకమైన ఇంటర్ డిసిప్లీనరీ అంశాలు వైశిష్ట్యమైన శాస్త్రీయ ఆవిష్కరణలకు దారితీస్తాయన్నారు. కార్యక్రమంలో కన్వీనర్ డాక్టర్ సీహెచ్. సుబ్రహ్మణ్యం, మద్రాస్ఐటీ ప్రొఫెసర్ జీ.రంగారావు, హైదరాబాద్ శాస్త్రవేత్త డాక్టర్ సూర్యప్రకాష్‌సింగ్‌లు వివిధ అంశాలపై ప్రసంగించారు. కార్యక్రమంలో ఎడ్యుకేషన్ సొసైటీ ఉపాధ్యక్షులు దొప్పలపూడి రామ్మోహనరావు, గెల్లి దిలీప్ కుమార్, సంయుక్త కార్యదర్శి కొమ్మినేని హరిపద్మ ప్రసాద్, కోశాధికారి తాళ్ళూరి రామకృష్ణారావు, కో కన్వీనర్ డాక్టర్ వి.మాధవరావు, ఆర్గనైజింగ్ సెక్రటరి డాక్టర్ కె.ప్రసాదరావు, వివిధ విభాగాల అధిపతులు, ఆధ్యాపకులు, రీసెర్చ్ స్కాలర్స్ తదితరులు పాల్గొన్నారు.


కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు

డీఏ బకాయిలను విడుదల చేయాలి

● రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ నేతల డిమాండ్

బాపట్ల, జనవరి 29 : డీఏ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, తగ్గించిన అడిషన్ క్వాంటమ్‌ను పునరుద్ధరించాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ నేతలు డిమాండ్ చేశారు. తమ డిమాండ్ల సాధన కోరుతూ సోమవారం కలెక్టరేట్ ఎదుట బాపట్లశాఖ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. డీఏ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, పీఆర్సీ బకాయిలు చెల్లించాలని, హెల్త్‌కార్డులపై క్యాష్ లెస్ వైద్యసేవలు అందించాలని చూడాలని డిమాండ్ చేశారు. మెడికల్ రీఎంబర్స్‌మెంట్ పరిధి రూ. 2 నుంచి రూ. 5 లక్షలకు పెంచాలన్నారు. కార్యక్రమంలో జిల్లాశాఖా అధ్యక్షుడు చెరుకూరి సుబ్బారావు, కార్యవర్గ సభ్యులు సీహెచ్.రాజారత్నం, జిల్లా ఉపాధ్యక్షులు షేక్.జిలానీ, జిల్లాశాఖ కార్యదర్శి ఏవీ భవానీ శంకర్, కోశాధికారి జీఎస్ఆర్‌కె. ప్రసాద్, సంయుక్త కార్యదర్శి జి.సూర్య నారాయణ, రమేష్, వల్లయ్య, శ్రీరామమూర్తి, ఆంజనేయులు, నాగమల్లేశ్వరరావు, ఎం.గూడారు తదితరులు పాల్గొన్నారు. అనంతరం స్పందనలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

వ్యవసాయ విద్యార్థులకు ముగిసిన శిక్షణ

పిట్టలవానిపాలెం, జనవరి 29 : ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం అనుసంధానమైన సీఎస్ పురంకు చెందిన కదిరి బాబురావు వ్యవసాయ కళాశాల ఫైనల్ బీఎస్సీ విద్యార్థుల శిక్షణ సోమవారం ముగిసింది. బాపట్ల ఏరువాక కేంద్రం ఆధ్వ ర్యంలో గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ పథకంలో భాగంగా ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మూడు నెలల కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రమైన పిట్టలవానిపాలెం గ్రామ పంచాయతీలో చందోలు, ఖాజీపాలెం, పిట్టలవానిపాలెం, రైతు భరోసా కేంద్రాల్లో ఒక్కొక్క కేంద్రానికి 9 మంది చొప్పున ఆయా ప్రాంతాలలో విద్యార్థులు పాల్గొని వ్యవసాయంపై పలు అంశాలను రైతులకు తెలియజేయటంతో పాటు వారి వద్ద నుండి కూడా పలు అంశాలను తెలుసుకున్నారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేవీఆర్ కళాశాల అసోసియేట్ డీన్ ఎస్.త్రిమూర్తులు, టీవోటీ డాక్టర్ ఎన్‌సీ ఓబయ్య, డాక్టర్ జే.రాధాకృష్ణలు, పిట్టలవానిపాలెం సర్పంచ్ బొలగాని అరుణకుమారి సుబ్బారావు, ఏఈవో సి.హెచ్.సుదర్శనరావు, ఖాజీపాలెం సర్పంచ్ కె.అనూష ప్రసన్నరాజు, ఖాజీపాలెం సొసైటీ అధ్యక్షుడు దేవేంద్రరాజు, తేనె బాషాలు పాల్గొన్నారు.


డైరీ, క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ పీ.రంజిత్‌బాషా, జేసీ తదితరులు

వ్యవసాయాధికారుల సంఘ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

బాపట్ల,జనవరి 29 : ఆంధ్రప్రదేశ్ వ్యవసాయాధికారుల సంఘం డైరీ, క్యాలెండర్‌ను కలెక్టర్ పి.రంజిత్‌బాషా సోమవారం స్పందన సమావేశ మందిరంలో ఆవిష్కరించారు. సంఘజిల్లా అధ్యక్షుడు కే.ధనరాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సీహెచ్.శ్రీధర్, జిల్లా వ్యవసాయాధికారి షేక్.అబ్దుల్ సత్తార్, డీఆర్‌డీడీఏ ఎం.విజయనిర్మల, సంఘ కార్యదర్శి కే.వెంకటకృష్ణ, కోశాధికారి లోకేశ్వరి, డీఆర్వో పి.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయానికి సంబంధించిన అంశాలు, ఎరువులు, పురుగుమందులు, విత్తనాల చట్టానికి సంబంధించిన అన్ని అంశాలు డైరీలో పొందుపర్చటం వ్యవసాయాధికారులకు ప్రయోజనంగా ఉంటుందన్నారు.

గడువులోగా అర్జీలను పరిష్కరించాలి

● స్పందనలో కలెక్టర్ పీ.రంజిత్‌బాషా

బాపట్ల, జనవరి 29: స్పందన, జగనన్నకు చెబుదాం వెబ్ పోర్టల్‌లో వచ్చిన అర్జీలను గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. బాపట్ల కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమానికి వచ్చిన బాధితుల నుంచి కలెక్టర్ అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చీరాల ఆర్డీవో పరిధిలో 6 అర్జీలు పెండింగ్‌లో ఉండటంపై సమీక్షించారు. అదే విధంగా వివిధ శాఖలలో పెండింగ్ దరఖాస్తులపై ఆరా తీసి, గడువులోగా పరిష్కారం చూపాలని ఆదేశించారు. కార్యక్రమంలో జేసీ హెచ్.శ్రీధర్, డీఆర్వో పీ.వెంకటరమణ, అధికారులు పాల్గొన్నారు.

బాలికకు పెళ్ళి చేశారంటూ తండ్రి ఫిర్యాదు

కొరిశపాడు మండలం తమ్మవరం గ్రామానికి చెందిన ఓ మహిళకు కనిగిరికి చెందిన వ్యక్తికి వివాహం జరిగింది. వీరికి ముగ్గురు సంతానం. భార్యభర్తల మధ్య మనస్పర్ధలు రావటంతో తనకు తెలియకుండా 12ఏళ్ళ తన బిడ్డకు తన భార్య వివాహం చేసిందంటూ భర్త స్పందనలో ఫిర్యాదుచేశాడు. దీంతో జేసీ సీహెచ్ శ్రీధర్ వివరాలు తెలుసుకొని దీనిపై చర్యలు తీసుకోవాలని ఐసీడీఎస్ పీడీ ఉమా దేవిని ఆదేశించారు.

కార్మికులంతా పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలి

బాపట్ల పురపాలక సంఘం పరిధిలో పనిచేసే 167 మంది కార్మికులలో 30 మందిని శానిటరి సెక్రటరీలుగా నియమించడంతో, మిగిలిన 137 మందిపై పనిభారం పెరిగి ఇబ్బంది పడుతున్నారని, పైగా ఆ 30 మంది కింది కార్మికులపై పెత్తనం, వేధింపులకు పాల్పడుతన్నారని మునిసిపల్ వర్కర్స్‌యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కోటి దాను, సీపీఐ నేతలు జేబీ శ్రీధర్‌లు కలెక్టరుకు వినతిపత్రం ద్వారా వివరించారు.

తాత్కాలిక నివాస వసతి కల్పించాలి ..

చీరాల పట్టణంలో చిరువ్యాపారాలు చేసుకుంటూ నివాస స్థలాలు, ఇళ్ళు లేక రోడ్ల పక్కనే చంటిబిడ్డలతో నానా ఇబ్బందులు పడుతున్న నక్కల కులస్థులకు తాత్కాలిక నివాస వసతి కల్పించాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. నక్కల కులస్థులందరితో కలిసి సోమవారం స్పందన లో ఫిర్యాదు చేశారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి..

పట్టణంలోని కారుమూరి హనుమంతరావు కాలనీ సమీపంలో డినెం.1045/1లో ఎకరం 70 సెంట్లు తాటితోపు పోరంబోకు ప్రభుత్వ భూమిని కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించారని బహుజనసమాజ్‌పార్టీ జిల్లా అధ్యక్షులు కాగిత కోటేశ్వరరావు స్పందనలో కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపి ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరారు.

క్రైస్తవులపై దాడులను అరికట్టాలి..

బాపట్ల రూరల్ : క్రైస్తవులపై జరుగుతున్న దాడులను అరికట్టాలంటూ సోమవారం బాపట్ల కలెక్టరేట్ ఆవరణంలో కలెక్టర్‌కు పాస్టర్


కలెక్టర్ పీ.రంజిత్‌బాషాకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నేతలు

ఎడ్డర్డ్‌థామస్ వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. బాపట్ల మండలంలోని కొండుబొట్లవారిపాలెం గ్రామంలో చర్చి నిర్మానం కోసం 5 సెంట్లు స్థలాన్ని సంఘస్తులు కొనుగోలు చేశారు. ఆ స్థలంలో పనులు ప్రారంభిస్తున్న సమయంలో విశ్వహిందు పరిషత్ నేతలు అక్కడికి వచ్చి ' మా హిందువుల ఉంటున్న ఈప్రదేశంలో క్రైస్తవ మతాలకు చెందిన చర్చిని నిర్మించడానికి వీల్లేదు' అంటూ ఆసభ్య కరంగా మాట్లాడి దాడికి దిగారన్నారు. వారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టరును కోరినట్లు తెలిపారు.

డబ్బు తీసుకొని ఇళ్ల నిర్మించకుండా వేధిస్తున్నారు..

జగనన్నకాలనీలో ఇళ్ళ నిర్మాణం కోసం తమ వద్ద నగదు తీసుకొని నిర్మించకుండా ఓ వ్యక్తి వేధిస్తున్నాడని జె.పంగులూరు మండలం రేనంగివరం గ్రామానికి చెందిన బాధితులుగుమ్మడి కళ్యాణి, పద్మ, ఎ.లక్ష్మిలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. జగనన్నకాలనీలో ఇళ్ళ నిర్మాణం కోసం చీరాలకు చెందిన బాజిరెడ్డి అనే వ్యక్తి ఆరుగురు వద్ద ఒక్కొక్కరి నుంచి రూ.30 వేల చొప్పున నగదు తీసుకొని ఇల్లు నిర్మించకుండా వేధిస్తున్నాడని, అతనిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆక్రమణకు గురవుతున్న పంచాయతీ స్థలం..

బాపట్ల మండలం భర్తీపూడి గ్రామ పంచాయతీ స్థలం ఆక్రమణకు గురవుతున్నదని ఆ గ్రామ సర్పంచ్ అచంట అమరేష్ కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. గ్రామపంచాయతీ పరిధిలోని డి.నెం 65/2 సుమారు 4సెంట్ల స్థలం అప్పికట్ల గ్రామానికి చెందిన నల్లూరి వెంకటప్పయ్య, కుమారుడు భానుప్రసాదరావు, భర్తీపూడిగ్రామపంచాయతీ కమ్యూనిటి హాలు నిర్మాణం నిమిత్తం 2000 సంవత్సరంలో అగ్రిమెంట్ డాక్యుమెంట్ ద్వారా స్వాధీనపర్చాడు. అయితే కమ్యూనిటి హాలును బస్‌షెల్టర్ వెనుకగల రెవెన్యూ పోరంబోకు స్థలంలో నిర్మించారు. పంచాయతీ దాఖలు పరిచిన స్థలంలో మట్టితో మెరక చేయించి పంచాయతీ భవిష్యత్తులో అవసరాలు నిమిత్తం అలా ఉంచారు. ఇప్పుడు నల్లూరు భానుప్రసాద్ పంచాయతీకి దాఖలుపరిచిన 4 సెంట్లు స్థలాన్ని తన స్వంత స్థలంగా చూపించి ల్యాండ్ కన్వర్షన్ చేయించాడని, దీనిపై రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.


వైసీపీ నేతలకు పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న వేగేశన నరేంద్రవర్మ

వైసీపీని వీడి టీడీపీలోకి..

కర్లపాలెం, జనవరి 29 : కర్లపాలెం పంచాయతీ పరిధిలోని ఎంవీ రాజుపాలెం గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు పిట్టు వెంకటేశ్వర రెడ్డి టీడీపీ నేత పిట్ల వసంతరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం టీడీపీలో చేరారు. టీడీపీ బాపట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి వేగేశన నరేంద్రవర్మ సమక్షంలో పార్టీ కుండువా వేసుకొని టీడీపీలో చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పిట్ల వసంతరెడ్డి, పఠాన్ కరీముల్లా, నభి, కట్టా సుజాత, తదితరులు పాల్గొన్నారు.

రక్షణ్‌నగర్‌లో ఘనంగా జెండా పండుగ

● పాల్గొన్న టీడీపీ బాపట్ల ఇన్‌చార్జి వేగేశన

పిట్టలవానిపాలెం, జనవరి 29 : మండల పరిధిలోని కొత్తపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని రక్షణ్‌నగర్ గ్రామంలో సోమవారం జెండాపండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా బాపట్ల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వేగేశన నరేంద్రవర్మ పార్టీశ్రేణులతో కలిసి చర్చిలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్ధనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చర్చి నిర్వాహకులు, గ్రామపెద్దలు వేగేశన నరేంద్రవర్మను పూలమాలలతో, దుశ్శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఎండీ అఫ్జల్, కొత్తపాలెం గ్రామ టీడీపీ అధ్యక్షుడు జి.స్వామిరెడ్డి, మురళీరాజు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు సినీ సాహిత్య సిరి 'వేటూరి'

బాపట్లటౌన్, మే 29 : తెలుగు సినిమా పాటకు కావ్య గౌరవాన్ని ప్రసాదించిన కవి తెలుగు సినిమా పాటకు కేంద్ర స్థాయి గుర్తింపు తీసుకొచ్చిన సినీ సాహిత్య సిరి వేటూరి సుందర రామమూర్తి అని సాహితి భారతి అధ్యక్షుడు రావూరి నరసింహవర్మ అన్నారు. సోమవారం వేటూరి సుందరరామమూర్తి 88వ జయంతి సభ నిర్వహించారు. సాహితి భారతి కోశాధికారి ఆదంషఫి, ఉపాధ్యక్షులు ఎం.మాల్యాద్రిరావు ప్రజాకవి డాక్టర్ శ్రీనివాస్‌లు సంయుక్తంగా మాట్లాడుతూ.. వేటూరి తన రచనలతో తెలుగు సినీ సాహిత్యాన్ని సుసంపన్నం చేశారని, సుమారు పది వేల పాటలు వరకు రచించారని తెలిపారు. అనంతరం సాహితిభారతి రచయతలు రావూరి నరసింహవర్మ, ఆదంషఫి, ఎం. మాల్యాద్రిరావు, కస్తూరి శ్రీనివాసరావు, ఎన్.కృష్ణ, బొడ్డుపల్లి శ్రీరామచంద్రమూర్తి తదితరులు వేటూరి సుందరరామమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘననివాళులు అర్పించారు.

అలుమ్నిహౌస్‌కు అసోసియేట్ డీన్ విరాళం

బాపట్ల,జనవరి 29 : బాపట్ల వ్యవసాయ కళాశాలలో పూర్వవిద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న అలుమ్నిహౌస్‌కు కళాశాల అసోసియేట్‌డీన్ డాక్టర్ వీ.శ్రీనివాసరావు సోమవారం రూ.1,11,111 విరాళాన్ని అందజేశారు. కళాశాలలో స్టాటిస్టిక్స్ విభాగంలో చేరి ప్రొఫెసర్‌గా ఎదిగి ప్రస్తుతం కళాశాల డీన్‌గా పనిచేస్తున్న ఆయన ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులుగా పనిచేశారు. కళాశాల మీద ప్రేమతో ఈ మొత్తాన్ని అందజేశారు.

అనారోగ్యంతో ఫిల్డ్ అసిస్టెంట్ మృతి

కర్లపాలెం, జనవరి 29 : మండలంలోని ఏట్రవారిపాలెం గ్రామానికి చెందిన ఫిల్డ్ అసిస్టెంట్ పులుగు శ్రీనివాసరెడ్డి ఆదివారం అర్ధరాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. మృతదేహాన్ని మాజీ ఎమ్మెల్యే చీరాల గోవర్ధనరెడ్డి, సర్పంచ్ చీరాల వెంకటలక్ష్మీ, చీరాల శ్రీనివాసరెడ్డి, ఏపీవో సుభాషిణి, ఫిల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి హామీ పథకం సిబ్బంది శ్రీనివాసరెడ్డి మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు.

గిరిజన వ్యతిరేక ప్రభుత్వాన్ని సాగనంపాలి

● టీడీపీ బాపట్ల ఎస్టీ సెల్ అధ్యక్షుడు తిరుమలశెట్టి శ్రీను

బాపట్ల, జనవరి 29 : గిరిజన ప్రజా వ్యతిరేక ప్రభుత్వాన్ని సాగనంపాలని టీడీపీ బాపట్ల ఎస్టీసెల్ అధ్యక్షుడు తిరుమలశెట్టి శ్రీను పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో గిరిజన నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత ఎన్నికలలో 80 శాతం గిరిజనులు వైసీపీ ప్రభుత్వాన్ని గెలిపిస్తే చివరకు నిరాశ మిగిల్చారన్నారు. గిరిజనుల కోసం ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా తీరని అన్యాయం చేశారన్నారు. గిరిజనుల కోసం ఒక్కసంక్షేమ పథకం కూడా పెట్టలేని చేతగాని అసమర్థ ప్రభుత్వమని విమర్శించారు. ఎస్టీ కమిషన్ జగన్ జేబు సంస్థగా పనిచేస్తుందన్నారు. నామినేటెడ్ పదవులలో మొండిచేయి చూపించారన్నారు. గిరిజనుల అభివృద్ధి కోసం టీడీపీని గెలిపించుకొని చంద్రబాబును ముఖ్యమంత్రి చేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర ఎస్టీసెల్ ఉపాధ్యక్షుడు ఇండ్ల శ్రీనివాసరావు, పార్లమెంట్ కార్యదర్శులు నంబూరి ఏడుకొండలు, ఎ.వెంకటేశ్వర్లు, ఇండ్ల శ్రీనివాసరావు, మండల నేతలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న తిరుమలశెట్టి శ్రీను తదితరులు

మాజీ మంత్రి కన్నాపై దాడి హేయం

భట్టిప్రోలు, జనవరి 29 : మాజీ మంత్రి, టీడీపీ నేత కన్నా లక్ష్మీనారాయణపై దాడి హేయమైన చర్య అని సౌత్ ఇండియా కాపు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వేల్పూరి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పల్నాడు జిల్లా తొండేపిలో టీడీపీ నేత కన్నా లక్ష్మీనారాయణపై వైసీపీ రౌడీల రాళ్ళ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిననాటి నుంచి రాష్ట్రం రౌడీ రాజ్యంగా మారిందని, ప్రజలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం లేదని రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని వైసీపీ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. లక్ష్మీనారాయణపై రాళ్ళ దాడి చేసిన వారిని తక్షణమే అరెస్టు చేయాలని, పల్నాడుజిల్లా ఎస్పీని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. వైసీపీ అరాచక మూకల దాడులకు సీఎం జగన్‌రెడ్డి తగిన మూల్యం చెల్లించకోక తప్పదన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలందరూ ఐక్యంగా జైలు పార్టీని తరిమికొట్టాలని విజ్ఞప్తి చేశారు.

దరఖాస్తుదారులకు రెడ్‌క్రాస్ అల్పాహారం

బాపట్ల,జనవరి 29 : కలెక్టరేట్, జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి విచ్చేసిన దరఖాస్తుదారులకు బాపట్ల జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ఛైర్మన్ బీ.ఎస్.నారాయణభట్టు ఆధ్వర్యంలో అల్పాహారం ఏర్పాటు చేశారు. గోపాలకృష్ణమూర్తి, నాగమణి దంపతుల సహకారంతో దూరప్రాంతాలు నుంచి వచ్చే 300 మందికి ఆహారాన్ని అందజేశారు. కార్యక్రమంలో రమణబాబు, సత్యనారాయణరాజు, బూర్లె రామసుబ్బారావు, వేణు, గోపి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భట్టిప్రోలు, జనవరి 29 : భట్టిప్రోలు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ఏడుకొండలు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో మంగళవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

రైతులకు పూర్వ విద్యార్థుల సాయం

అమృతలూరు, జనవరి 29 : ఇటీవల తుఫాన్‌కు పంట నష్టపోయిన రైతులకు పూర్వ విద్యార్థుల కమిటీ రూ.20 వేలు సాయం అందజేశారు. అమృతలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1982-83లో 10వ తరగతి చదివిన విద్యార్థులు సోమవారం పాఠశాలలో నష్టపోయిన ఒక్కో రైతుకు రూ.5 వేలు వంతున అందజేశారు. రైతులు కొత్తపల్లి వెంకటేశ్వరరావు, యలవర్తి రాజా, రామిశెట్టి నాగేశ్వరరావు, అంకెం రామకృష్ణలకు హెచ్ఎం నిరీక్షణరావు, చేతుల మీదుగా నగదును అందించారు. కార్యక్రమంలో మాజేటి వెంకటేశ్వరరావు, గిరిధర్, పోతురాజు, మధు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.


దుప్పట్లు పంపిణీ చేస్తున్న ప్రముఖ సినీ రచయిత కోన వెంకట్

పెన్షన్‌దారులకు దుప్పట్లు పంపిణీ

కర్లపాలెం, జనవరి 29 : మండలంలోని చింతాయపాలెంలో కోన చారిటబుల్‌ట్రస్ట్ ఆధ్వర్యంలో పంచాయతీ పరిధిలోని పెన్షన్‌దారులకు సోమవారం కోనట్రస్ట్ దుప్పట్లు పంపిణీ ఏర్పాటు చేయగా ప్రముఖ సినీరచయత కోన వెంకట్ ముఖ్యఅతిథిగా పాల్గొని పెన్షన్‌దారులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ యారం వనజ, ఎఎంసి ఛైర్మన్ దొంతిబోయన సీతారామిరెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ యల్లావుల ఏడుకొండలు, కాగిత మహేష్, కాగిత శుభాష్ చంద్రబోస్, ఎంపిటిసి రాతంశెట్టి లక్ష్మణరావు, పెదపులుగువారిపాలెం సర్పంచ్ అక్కల శ్రీనివాసరెడ్డి, మండల రైతు నాయకులు పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులు వేగంగా పరిష్కరించాలి

● గ్రీవెన్స్‌లో ఎస్పీ వకుల్ జిందాల్

బాపట్ల, జనవరి 29 : స్పందన ఫిర్యాదులను వేగంగా పరిష్కరించాలని ఎస్పీ వకుల్ జిందాల్ పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి సమస్యల పరిష్కారం కోరుతూ 58 ఫిర్యాదులు వచ్చాయి. ఫిర్యాదుదారుల సమస్యలను విచారించి త్వరితగతిన పరిష్కరించానలి ఎస్పీ సూచించారు. ఫిర్యాదుదారుల సమస్యలను విని వారు ఇచ్చిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి వెంటనే వాటిపై చట్టపరిధిలో చర్యలు తీసుకోవాలని ఆయాపోలీసుస్టేషన్‌ల అధికారులను ఆదేశించారు. ప్రజలు తమ సమస్యలు చెప్పుకోవటానికి స్టేషన్‌కు వచ్చినప్పుడు వారిలో ధైర్యాన్ని పెంపొందించి చట్టపరిధిలో వారి సమస్యలు పరిష్కరించాలన్నారు. ఫిర్యాదుదారుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన, సమస్యల పరిష్కారంలో జాప్యం చూపిన శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ పి.మహేష్, డిసిఆర్‌బి ఇన్‌స్పెక్టర్ మురళీ కృష్ణ, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.


రోడ్డుపై బైఠాయించి రిలేనిరాహారదీక్ష చేస్తున్న సెర్ప్‌సిబ్బంది

'సెర్ప్' ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

● బాపట్లలో కొనసాగుతున్న రిలే నిరాహరదీక్షలు

బాపట్ల, జనవరి 29 : సెర్ప్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు వైఎస్సార్ క్రాంతిపథంలో పనిచేస్తున్న ఎం.ఎస్ సీసీలు, కమ్యూనిటి సర్వేయర్లు, సీసీలు, ఏపీఎంలు, డీపీఎంలు బాపట్ల జిల్లా జేఏసీగా ఏర్పడి ఈనెల 23 నుంచి నిరవధిక సమ్మె చేస్తున్నారు. సోమవారం మునిసిపల్ కార్యాలయం సమీపంలోని ఉప్పరపాలెం రోడ్డుపై రిలే నిరాహారదీక్ష చేపట్టారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి జేఏసీ జిల్లా అధ్యక్షుడు టి.శ్రీనివాసరావు మాట్లాడుతూ సెర్ప్ సిబ్బందిని పర్మినెంట్ చేస్తానని సీఎం జగన్ ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. దీక్షలలో పీ.ప్రమీల, బీ.అనురాధ, ఎం.సుమలత, వీ.దేవిప్రసన్న, కే.మంజులలు కూర్చోన్నారు. కార్యక్రమంలో జేఏసీ నేతలు సీహెచ్.సాల్మన్, టీ.రాజారావు, కే.రవికుమార్, ఎస్.వందనం తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరరావు కుటుంబానికి అండగా టీడీపీ

● ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ ● నేడు చెరుకుపల్లికి నారా భువనేశ్వరి రాక

రేపల్లె, జనవరి 29: చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టును తట్టుకోలేక మనస్థాపంతో మృతి చెందిన కోటా వెంకటేశ్వరరావు కుటుంబానికి టీడీపీ అన్నివిధాలా అండగా ఉంటుందని ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ అన్నారు. సోమవారం చెరుకుపల్లిలోని వెంకటేశ్వరరావు కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా అనగాని మాట్లాడుతూ వెంకటేశ్వరరావు కుటుంబాన్ని పరామర్శించటానికి మంగళవారం నారా చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి మధ్యాహ్నం 2గంటలకు చెరుకుపల్లి రానున్నదని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మల్లాది రామకృష్ణ, దివి రాంబాబు, తాతా ఏడుకొండలు, పూషడపు కుమారస్వామి, తదతరులు పాల్గొన్నారు.


కోటా వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అనగాని

ప్రజలను మోసం చేస్తున్న ప్రభుత్వం

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు డీ.రమాదేవి

బాపట్ల జనవరి 29 : ఇళ్ళ రిజిస్ట్రేషన్ పేరుతో ప్రభుత్వం కొత్త ప్రక్రియకు తెర తీసి హడావుడి చేస్తూ జగనన్న కాలనీలలో మౌలిక వసతులు కల్పించకుండా ప్రజలను మోసం చేస్తుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు డి.రమాదేవి అన్నారు. బాపట్ల ప్రజా సంఘాల కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సీపీఎం జిల్లా కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇళ్ళ రిజిస్ట్రేషన్ అదనంగా ఉపయోగం ఉచితంగా చేస్తున్నాం ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా చేస్తున్నామని గొప్పలు చెప్పుకోవటం సిగ్గుచేటు అన్నారు. గృహనిర్మాణాలు చేసుకున్న వెంటనే రిజిస్ట్రేషన్ చేసి ఉండాలన్నారు. ఇప్పుడు ఏదో గొప్పఅని ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. ఇళ్ళ పట్టాలు రద్దు చేస్తామంటే గత్యంతరం లేక లక్షల రూపాయలు అప్పులు జేసి కట్టుకుంటే జగనన్నకాలనీలలో రోడ్లు, తాగు నీరు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలు కల్పించకుండా మోసం చేశారని విమర్శించారు. ఎన్నికలకు ముందు అయిన కాలనీలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కులగణన జరుగుతున్నప్పటికి వెనుకబడిన తరగతుల వారికి ప్రయోజనం ఏమిటో దానికి తగిన స్థాయిలో నిర్దిష్టంగా జరగటంలేదన్నారు. రాష్ట్రంలో కులగణన చేస్తున్న వైసీపీ ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం అందుకు అవసరమైన సహాయం చేసేటట్లు ఉండాలికాని దానికి భిన్నంగా ఎన్నికల ముంగిట్లో హడావుడిగా చేయటం వెనుకబడిన తరగతులకు అదనపు ఫలితం దక్కదన్నారు. బాపట్లజిల్లాలో దుగ్గిరాలలో పసుపు నిల్వపెట్టుకున్న గోదాం అగ్నిప్రమాదంలో దగ్ధమై అందులో పసుపుదాచుకున్న రైతులకు కోట్ల రూపాయలు నష్టపోయినట్లు చెబుతున్నారన్నారు. దీనికి సమాధానం చెప్పాల్సిన కోల్డ్‌స్టోరేజి యాజమాన్యం వాస్తవాలు చెప్పటానికి ముందుకు రావటంలేదన్నారు. అధికారులు కూడా దీనిని తాత్సారం చేస్తున్నారన్నారు. ఎవరైతే ఈ కోల్డ్ స్టోరేజిలో పసుపు నిల్వపెట్టుకున్నారో తక్షణమే వారందరి వివరాలు తీసుకొని నష్టం మొత్తం అతని దగ్గర నుంచి రాబట్టాల్సిన అవసరం ఉందన్నారు. దీనికి ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి సి.హెచ్. గంగయ్య మాట్లాడుతూ తుఫాన్ బాపట్ల జిల్లాలో తీరం దాటితే సీఎం పర్యటన చేసి రైతులందరిని ఆదుకుంటామని, సంక్రాంతి నాటికి నష్టపరిహారం బ్యాంక్‌ఖాతాలలో జమచేస్తామని హామినిచ్చి దాని ఊసేలేకుండా చేశారన్నారు. రైతులకు పరిహారం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం కమిటీ సభ్యులు పీ.కృష్ణమోహన్, మణిలాల్, ఎన్.బాబురావు తదితరులు పాల్గొన్నారు.

నేడు గౌతు లచ్చన్న విగ్రహావిష్కరణ

● హాజరుకానున్న ఎమ్మెల్యే అనగాని, మాజీ మంత్రులు ఆలపాటి, ఆనందబాబు

వేమూరు, జనవరి 29 : మండలంలోని బలిజేపల్లి గ్రామంలో మంగళవారం ఉదయం సర్దార్ గౌతులచ్చన్న విగ్రహా ఆవిష్కరణ కార్యక్రమం జరుగుతుందని నిర్వాహక కమిటీ సభ్యులు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రేపల్లె ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ చేతుల మీదుగా విగ్రహ ఆవిష్కరణ జరుగుతుందన్నారు. మాజీ మంత్రులు నక్కా ఆనందబాబు, ఆలపాటి రాజేంద్రప్రసాద్‌లు ముఖ్య అతిథులుగా, బాపట్ల జిల్లా తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు విశిష్ట అతిథిగా, నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయ కర్త ఊసా రాజేష్ గౌరవ అతిథిగా పాల్గొంటారని కార్యక్రమ పర్యవేక్షకులు కోగంటి బాలగంగాధరరావు, దొప్పలపూడి సుధాకర్‌లు తెలిపారు. కార్యక్రమానికి నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీ శ్రేణులు, గౌతు లచ్చన్న గౌడ్ అభిమానులు, సంఘీయులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని, విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని కమిటీ సభ్యులు కోరారు.


ఆవిష్కరణకు సిద్ధమైన సర్దార్ గౌతు లచ్చన్న గౌడ్ విగ్రహం



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బలరాం

దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం

» ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి

చీరాల, జనవరి 29: నియోజకవర్గంలో సుదీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరిస్తున్నట్టు ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి చెప్పారు. అందుకు ఊటుకూరివారి వీధి విస్తరణ, నూతన సీసీ నిర్మాణం నిదర్శనమని అన్నారు. స్థానిక కొట్లబజారు నుంచి నల్లగాంధీ బొమ్మకు వెళ్లే ఊటుకూరివారి వీధిలో రూ.40 లక్షలతో నిర్మించిన నూతన సీసీ రోడ్డును సోమవారం బలరాం ప్రారంభించారు. ఈసందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే బలరాం మాట్లాడుతూ ఆర్యవైశ్యులకు ఎప్పుడు అండగా ఉంటామన్నారు. మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా పురప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించటమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు.

కార్యక్రమంలో వైస్‌చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, గుంటూరు మాధవరావు, మల్లెల లలితరాజశేఖర్, గుంటూరు ప్రభాకరరావు, మామిడాల రాములు, కీర్తి వెంకట్రావు, బత్తుల అనిల్, కంపా అరుణ్, చిలుకోటి శ్రీనివాసరావు, చిన్ని లీలాధర్, మాగం మురళి, తులాబంధు వెంకటసురేష్, శ్రీరామ్ వేణుగోపాల్, షేక్ మహిమూద్, కళ్యాణం విజయ్‌ప్రకాష్, రియాజ్, మున్సిపల్ డీఈ ఏసయ్య పాల్గొన్నారు.

'ఆసరా'ను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెంకటేష్

చీరాల, జనవరి 29: ఆసరా సొమ్మును లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ అన్నారు. స్థానిక ఎన్ఆర్ అండ్ పీఎం హైస్కూల్ ప్రాంగణంలోని ఓపెన్ ఎయిర్ థియేటర్లో సోమవారం జరిగిన ఆసరా నాలుగో విడత సంబరాలకు వెంకటేష్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మున్సిపల్ పరిధిలో 957 స్వయం సహాయక సంఘాలకు రూ.6.49 కోట్లు జమ చేసినట్టు చెప్పారు. సీఎం జగన్ పేదల పక్షపాతి అనేందుకు ఇది నిదర్శనమన్నారు. కార్యక్రమంలో సీఎంఎం సుబ్రమణ్యం, మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్‌చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, నాయకులు కొండ్రు బాబ్జి, గుంటూరు మాధవరావు, మల్లెల లలితరాజశేఖర్, గవిని శ్రీనివాసరావు, పలువురు కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాపై జాగ్రత్తలు తీసుకోవాలి



మేదరమెట్లలో టీడీపీ నాయకులకు, కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్న సుబ్బారాయుడు

మేదరమెట్ల, జనవరి 29: ఓటర్ల జాబితాపై నిరంతరం నిఘా ఉంచి అర్హులైన ఓటర్లను తొలగించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలుగుదేశం నాయకులకు శిక్షణ ఇస్తున్న కొల్లా సుబ్బారాయుడు తెలిపారు. సోమవారం మండలంలోని మేదరమెట్ల, పమిడిపాడు గ్రామాల్లో పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. చంద్రబాబు ప్రకటించిన ఆరు హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. అనర్హుల ఓట్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో ఇంటింటికి తిరిగి బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ అంశాలను ప్రచారం చేయాలన్నారు. వచ్చే ఎన్నికల్లో బూత్‌వారీగా, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే దానిపై స్పష్టమైన అవగాహనతో గ్రామ నాయకులు ఉండాలన్నారు.

కార్యక్రమంలో మేదరమెట్ల శ్రీనివాసరావు, మన్నే ప్రసాద్, జాగర్లమూడి జయకృష్ణ, నాదెండ్ల కోటేశ్వరరావు, జాగర్లమూడి వీరాంజనేయులు, మందా నాగేశ్వరరావు, చింతా సుబ్బారావు, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీదేవి మద్దతు కోరిన హనిమిరెడ్డి



హనిమిరెడ్డిని సన్మానిస్తున్న శ్రీదేవి

మేదరమెట్ల, జనవరి 29: మాజీ ఎమ్మెల్యే జాగర్లమూడి రాఘవరావు కుమార్తె విక్రం శ్రీదేవిని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పానెం చిన్నహనిమిరెడ్డి కలిసి మద్దతు కోరారు. సోమవారం కొరిశపాడు మండలం పమిడిపాడులోని శ్రీదేవి ఇంటికి వెళ్లి వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీకి మద్దతు ఇవ్వాలని కోరారు. గతంలో శ్రీదేవితోపాటు మరికొందరిని వైసీపీ సస్పెండ్ చేసింది. హనిమిరెడ్డి ఇన్‌చార్జి బాధ్యతలు స్వీకరించాక శ్రీదేవితో పాటు మిగతా నేతలపై కూడా సస్పెన్షన్‌ను ఎత్తివేయించారు. ఈనేపథ్యంలో శ్రీదేవిని కలిసి పార్టీ పటిష్టతకు పనిచేయాలని ఆయన కోరారు. ఆయన వెంట కరణం సుబ్బయ్య, జాగర్లమూడి యలమందరావు, పాలపర్తి చిట్టి, తదితరులు ఉన్నారు.

పశువుల రక్షణకు చట్టాలు

ఒంగోలు(రూరల్)జనవరి 29: మానవుల రక్షణకు ఎలాంటి చట్టాలు ఉన్నాయో పశువుల రక్షణకు అలాంటి చట్టాలు ఉన్నాయని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కె.బేబిరాణి అన్నారు. మండలంలోని కరవది జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం పశు సంక్షేమ పక్షోత్సవాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ మానవులు ఎలా జీవిస్తున్నారో అలాగా పశువులు, పక్షులు స్వేచ్ఛగా జీవించాలన్నారు. పశువులను, పక్షులను హింసిస్తే నేరమవుతుందన్న విషయాన్ని విద్యార్థులు తెలుసుకోవాలన్నారు . కుక్కలు వీధులలో ఉన్నప్పటికి వాటిని చంపటం నిషేధమన్నారు. అనంతరం పశువుల రక్షణ పై విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు అధికారిని బహుమతులు అందచేశారు.ఈకార్యక్రమంలో త్రోవగుంట పశువైద్యశాల ఏడీ డాక్టర్ బి. బసవశంకరరావు, ఉలిచి పశువైద్యాధికారి డాక్టర్ ప్రతిమ, పశువైద్య అధికారి కాట్రగడ్డ లక్ష్మయ్య , కరవది సర్పంచ్ దేవరపల్లి కోటేశ్వరరావు, పాఠశాల హెచ్‌ఎం, ఎస్‌వీ రవికుమార్ ,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పీఎఫ్ సమస్యలను వెంటనే పరిష్కరిస్తాం

ఒంగోలు(విద్య), జనవరి 29: జిల్లాలోని ప్రైవేటు విద్యా సంస్థల యాజమాన్యాలు, ఉద్యోగులు, పెన్షనర్లు తమ పీఎఫ్ సమస్యలను తమ దృష్టికి తెస్తే వెంటనే పరిష్కరిస్తామని పీఎఫ్ కమిషనర్ సతీష్‌కుమార్ తెలిపారు. ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక పీడీసీసీ బ్యాంకు కేంద్ర కార్యాలయ సమావేశపు హాలులో నిర్వహించిన నిధి ఆప్‌కే నికిత ప్రథమ వార్షికోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్మిక శాఖ జాయింట్ కమిషనర్ ఎస్. శ్రీనివాసకుమార్ మాట్లాడుతూ కార్మికులకు నిధి ఆప్‌కే నికిత ఎంతో ప్రయోజనకరమన్నారు. పీఎఫ్ నోడల్ అధికారి సమ్మయ్య మాట్లాడుతూ నిధి ఆప్‌కి నికిత ప్రారంభించి ఏడాది పూర్తయిన సందర్భంగా మొదటి వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యాజమాన్యాలు, ఉద్యోగులు, పెన్షనర్ల పీఎఫ్ సమస్యలను త్వరగా పరిష్కరించుకునే పద్ధతులను వివరించారు. పీడీసీసీ బ్యాంకు జనరల్ మేనేజర్ రాఘవయ్య మాట్లాడుతూ పీఎఫ్ సంస్థ అందిస్తున్న ఆన్‌లైన్ సేవలు ఎంత ఉపయోగకరమన్నారు. కార్యక్రమంలో అపుస్మా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేమాధవరావు, హనుమంతరావు, బ్యాంకు ఉద్యోగులు, వివిధ సంస్థల యాజమాన్యాలు, ఉద్యోగులు, పెన్షనర్లు, పీఎఫ్ జిల్లా కార్యాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

సమగ్ర మంచినీటి పథకం పూర్తయ్యేనా..!

» టీడీపీ హయాంలో రూ.85 కోట్లతో పనులు ప్రారంభం
» ఐదేళ్ళు గడిచినా ఇంకా సాగుతున్న వైనం
» రివర్స్ టెండరింగ్ పేరుతో కొంతకాలం కాలయాపన
» బిల్లుల చెల్లింపులు జరగక అర్ధంతరంగా నిలిపివేసిన కాంట్రాక్టర్
» అద్దంకి వాసులకు నీటి కష్టాలు ఎప్పటికి తీరేనో..!



అర్ధంతరంగా నిలిచిపోయిన ఓవర్‌హెడ్ ట్యాంక్



ఆయిల్ మిల్ రోడ్డులో పైప్‌లైన్‌లు వేసి వదిలి వేయటంతో ప్రమాదకరంగా ఉన్న సిమెంట్ దిమ్మెలు

అద్దంకి, జనవరి 29: అద్దంకి పట్టణ ప్రజల దాహార్తి తీర్చేందుకు వచ్చే 50 సంవత్సరాల అవసరాలను దృష్టిలో ఉంచుకొని టీడీపీ ప్రభుత్వ హయాంలో 2019 సంవత్సరంలో ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ ప్రత్యేక కృషితో సమగ్ర మంచినీటి పథకానికి రూ.85 కోట్లు మంజూరయ్యాయి. అప్పట్లోనే పనులు ప్రారంభించి కొంతమేర జరిగాయి. గుండ్లకమ్మ రిజర్వాయర్‌లో తమ్మవరం వద్ద ఇన్‌టేక్ వెల్ ఏర్పాటుచేసి అక్కడ నుంచి శింగరకొండ సమీపంలోని అద్దంకి కొండపై ఏర్పాటుచేసే ఓవర్ హెడ్ ట్యాంక్‌కు నేరుగా నీరు చేరేలా పైప్‌లైన్‌లు ఏర్పాటుచేయాల్సి ఉంది. ఎన్నికలకు ముందే తమ్మవరం వద్ద నుంచి అద్దంకి వరకు పైప్‌లైన్ పనులు అత్యధిక శాతం పూర్తయ్యాయి. అద్దంకి నుంచి అద్దంకి కొండ వరకు అవసరమైన పైప్‌లైన్‌లను ఆయా ప్రాంతాలలో సిద్ధంచేసి ఉంచారు. అద్దంకి కొండ వద్ద ఏర్పాటుచేసే ట్యాంక్ నుంచి గ్రావిటీ ద్వారా పట్టణంలోని అన్ని ఓవర్‌హెడ్ ట్యాంక్‌లకు నీరు చేరేవిధంగా రూపకల్పన చేశారు. అదేసమయంలో అక్కడే ఉన్న టిడ్కో ఇళ్ళకు కూడా పుష్కలంగా నీరు అందుబాటులో ఉండేవిధంగా పథకం రూపకల్పన చేశారు.

అయితే, వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావటంతో రివర్స్ టెండరింగ్ పేరుతో తమ్మవరం నుంచి అద్దంకి పట్టణంలోని మార్కెట్‌యార్డు వరకే పరిమితం చేసి, అక్కడ నుంచి పట్టణంలోని ఓవర్‌హెడ్ ట్యాంక్ లకు నీటిని పంపింగ్ చేసేలా ప్రతిపాదనలు మార్పు చేశారు. దీంతో టిడ్కో ఇళ్ళకు నీటి వసతి లేకుండా పోయింది. రివర్స్ టెండరింగ్‌లో కొత్తగా ఏర్పాటుచేసిన జగనన్న కాలనీలకు అదనంగా చేర్చారు. ఇలా సుమారు రెండు సంవత్సరాలకు పైగా సమయం గడిచిపోయింది. అనంతరం పనులు ప్రారంభమయ్యాయి. మార్కెట్‌యార్డు, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఎస్‌ఎస్సీ కాలనీ లలో ఓవర్ హెడ్ ట్యాంక్‌ల నిర్మాణ పనులు, పట్టణంలోని అంతర్గత పైప్‌లైన్‌ల పనులు చేపట్టారు. కొంతమేర పనులు చేపట్టిన తరువాత కాంట్రాక్టర్ చేసిన పనులకు సంబంధించి బిల్లుల చెల్లింపు ఆగిపోయింది. దీంతో గత ఐదారు నెలలుగా ఎక్కడి పనులు అక్కడే అసంపూర్తిగా నిలిచిపోయాయి. పట్టణంలో సీసీ రోడ్లు పగులగొట్టి పైప్‌లైన్‌లు వేయగా వాటిని అలానే వదిలివేయటంతో వాహనాల రాకపోకలకు మరింత ఇబ్బందిగా మారింది. ఎక్కడ పనులు అక్కడే నిలిచిపోవటంతో పనులు ఇంతలో పునః ప్రారంభమయ్యే పరిస్థితి కనిపించటం లేదు. మూడు సంవత్సరాల క్రితం పూర్తి కావాల్సిన సమగ్ర మంచినీటి పథకం పనులు ఎప్పుడు పూర్తవుతాయో కూడా అర్థంకాని పరిస్థితి నెలకొందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వేసవిలో నీటి సమస్య తలెత్తే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. పనులు పూర్తిచేసే విధంగా కృషి చేయాల్సిన అధికార పార్టీ నేతలు, మున్సిపల్ పాలక వర్గం మిన్నకుండటంతో ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అద్దంకి పట్టణ సమ గ్ర మంచినీటి పథకం పనులు పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నేనున్నానంటూ.. నిజం గెలవాలంటూ..

» నేడు బాపట్ల పార్లమెంట్ పరిధిలో నారా భువనేశ్వరి పర్యటన

పర్చూరు, జనవరి 29: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్ట్ నేపథ్యంలో కలతతో మృతి చెందిన కుటుంబాలకు భరోసా కల్పించేందుకు నేనున్నానంటూ.. నిజం గెలవాలంటూ నారా భువనేశ్వరి బాపట్ల పార్లమెంట్ పరిధిలో మంగళవారం పర్యటిస్తారని ఆపార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ఏడాది చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ రాజమహేంద్రవరంలో సత్యమేవ జయతే దీక్షలో చంద్రబాబు అక్రమ అరెస్టుతో మృతి చెందిన కుటుంబాలకు అండగా ఉంటానని భువనేశ్వరి మాట ఇచ్చారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా అయా కుంటుంబాలకు భరోసా ఇచ్చేందుకు పర్యటిస్తున్నారన్నారు. మంగళవారం బాపట్ల పార్లమెంట్ పరిధిలో నిజం గెలవాలని కార్యక్రమాన్ని భువనేశ్వరి నిర్వహిస్తున్నారని తెలపారు. గన్నవరం ఎయిర్‌పోర్టు వద్ద ఉదయం 11.30 కు బయలుదేరి రేపల్లె నియోజకవర్గం చెరుకుపల్లికి 1.50 గంటలకు చేరుకుంటారన్నారు. అక్కడ నుంచి 2.10కి అరుంబాక చేరుకుంటారని, అక్కడ 40 నిమిషాలు భోజనం విరామం తీసుకుంటారన్నారు. అతర్వాత బాపట్ల, జమ్ములపాలెం, రేటూరు, అప్పాపురం, కాకుమాను, పెదనందిపాడు మీదుగా 4.30 గంటలకు పర్చూరు నియోజకవర్గం చిననందిపాడు చేరకుంటారన్నారు. మువ్వా సింగారావు నివాసానికి చేరుకొని కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెబుతారన్నారు.

5.30 గంటలకు యద్దనపూడి చేరుకుంటారన్నారు. ఆగ్రామంలో మృతి చెందిన టెక్కెం నాగేశ్వరరావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తారన్నారు. అనంతరం మార్టూరు మీదుగా ఒంగోలు చేరుకుంటారని ఏలూరి తెలిపారు.

టీడీపీలో చేరిన పలువురు నేతలు

అద్దంకి, జనవరి 29: అద్దంకి పట్టణంలోని 5వ వార్డుకు చెందిన పలువురు వైసీపీ నేతలు, కార్యకర్తలు ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్‌ను సోమవారం చిలకలూరిపేటలో కలిసి టీడీపీలో చేరారు. మాజీ వార్డు మెంబర్ చిలుకూరి సంధ్యారాణి అనిల్ ఆధ్వర్యంలో మౌలాలి, మల్లికార్జున, అంజయ్య, మల్లేశ్వరరావు, హఫీజ్, బాషా తదితరులు ఎమ్మెల్యే రవికుమార్‌ను కలిసి తమ సంఘీభావం తెలిపారు. వినుకొండలో ఇటీవల వైసీపీ అల్లరిమూకల దాడిలో గాయపడిన మాజీ మున్సిపల్ చైర్మన్, అద్దంకి నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు పఠాన్ సమీమ్‌ఖాన్‌ను సోమవారం ఎమ్మెల్యే రవికుమార్ పరామర్శించారు.



ఎమ్మెల్యే రవికుమార్‌ను కలిసి సంఘీభావం తెలుపుతున్న అద్దంకి పట్టణంలోని 5వ వార్డు నేతలు

కొణిదెన వైసీపీ బీసీ నేతల చేరిక

బల్లికురవ, జనవరి 29: వైసీపీ బీసీ సామాజిక వర్గానికి చెందిన కీలక నేత, కొణిదెన గ్రామానికి చెందిన మాజీ జడ్పీటీసీ, మాజీ సర్పంచ్ తన్నీరు ఏడుకొండలు తన అనుచరులతో కలిసి సోమవారం ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్‌ను చిలకలూరిపేటలో ఆయన స్వగృహంలో కలిసి సంఘీభావం ప్రకటించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే వారితో మాట్లాడుతూ టీడీపీ విజయానికి సమిష్టిగా కృషి చేయాలన్నారు. పార్టీ కోసం కష్టపడిన వారందరికి సముచిత స్థానం కల్పిస్తామని చెప్పారు. కొత్త, పాత నేతలందరూ కలిసి గ్రామాలలో టీడీపీ బలోపేతానికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించుకోవాలన్నారు.

అలాగే, గొర్రెపాడు గ్రామానికి చెందిన వైసీపీ నేత మక్కెన స్వాములు ఎమ్మెల్యే రవికుమార్‌ను కలిసి సంఘీభావం ప్రకటిం చారు. ఎమ్మెల్యేను కలిసిన కొణిదెన బీసీ నేతల్లో పల్లపు కోటేశ్వరరావు, తన్నీరు ఆంజనేయులు, నాగేశ్వరరావు, యనమాల లక్ష్మయ్య, కుంచపు నాగేశ్వరరావు, కొండయ్య, వేమవరపు శంకర్, గుంజి పిచ్చయ్య, చట్టి పోతురాజు, సత్తి భూసి తదితరులు ఉన్నారు.

పలు కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే రవికుమార్

సంతమాగులూరు, జనవరి 29: మండలంలోని ఏల్చూరు గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్తలు ఎమ్మెల్యే రవికుమార్ సమక్షంలో సోమవారం టీడీపీలో చేరారు. సంతమాగులూరు మండలంలో పలుగ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఇప్పటికే ఎమ్మెల్యేను కలసి సంఘీభావం ప్రకటించారు. కాగా, మండలంలోని పత్తేపురంకు చెందిన చలపతిరావు దశదిన కర్మకు ఎమ్మెల్యే రవికుమార్ హాజరై నివాళులర్పించారు. అదేగ్రామానికి చెందిన అంబటి శ్రీనివాసరావు కుమారుడు చెన్నైలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా కుటుంబసభ్యులను పరామర్శించారు. అదే గ్రామానికి చెందిన దారం పెద కామాన్నయ్య ఇటీవల మృతిచెందగా వారి ఇంటికి వెళ్ళి నివాళులర్పించారు. తంగేడుమల్లికి చెందిన పెళ్ళూరి నరసింహ రోడ్డు ప్రమాదంలోగా యపడగా వారి ఇంటికి వెళ్ళి పరామర్శించారు. మిన్నెకల్లుకు చెందిన చిరుమామిళ్ళ కోటేశ్వరమ్మకు క్రవారం మృతి చెందగా వారి కుటుంబసభ్యులను పరిమర్శించారు. గ్రామానికి చెందిన కోట సాహెబ్ ఇటీవల మృతిచెందగా వారి ఇంటికి వెళ్ళి పరామర్శించారు.

వైసీపీ పతనం ఖాయం

» టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎంఎం కొండయ్య

చీరాల, జనవరి 29: వైసీపీ పతనమే రాష్ట్రాభివృద్ధికి మలుపు అని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎంఎం కొండయ్య అన్నారు. వచ్చే ఎన్నికల తరువాత వైసీపీ జెండా కనుమరుగవటం ఖాయమని చెప్పారు. సిద్ధం పేరుతో మరోసారి ప్రజలను మోసగించేందుకు సీఎం జగన్ సిద్ధమయ్యాయని అన్నారు. అయితే, ప్రజలు టీడీపీని గెలిపించుకుని చంద్రబాబును మరలా ముఖ్యమంత్రిని చేసేందుకు సిద్ధమయ్యారన్నారు. అందుకు ప్రజలు ఎన్నికల కోసం ఎదురు చూస్తున్నారన్నారు. వైసీపీని బంగాళాఖాతంలో కలిపే సమయం ఆసన్నమైందన్నారు. సీఎం జగన్ నాలుగు సంవత్సరాల 9 నెలల కాలంలో ప్రజా వ్యతిరేక పాలన సాగించారన్నారు. దీంతో ప్రజలు విసిగిపోయారని చెప్పారు. టీడీపీ, జనసేన కూటమి ప్రభుత్వం రావాల్సిన ఆవశ్యతను ప్రజలు గుర్తించారన్నారు.

బంగారు భవిష్యత్‌కు బాటలు వేద్దాం

చీరాల, జనవరి 29: టీడీపీని గెలిపించుకుందాం.. బంగారు భవిష్యత్‌కు బాటలు వేద్దాం.. అందుకనుగుణంగా పార్టీ శ్రేణులు నిర్విరామంగా పనిచేయాలని నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎంఎం కొండయ్య పిలుపునిచ్చారు. మండలంలోని తోటవారిపాలెం పోలేరమ్మ గుడి ప్రాంగణంలో సోమవారం రాత్రి స్థానిక నేత బూదాటి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కొండయ్య మాట్లాడుతూ వైసీపీ అరాచక, అప్రజాస్వామిక విధానాలను బంగాళాఖాతంలో కలపాలన్నారు. అందుకు పార్టీ శ్రేణులు భావసారూప్యం ఉన్న అందరిని కలుపుకుని ముందుకు సాగాలన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు.



సభలో మాట్లాడుతున్న కొండయ్య

కార్యక్రమంలో నాయకులు గుద్దంటి చంద్రమౌళి, ఎం.గౌరీఅమర్‌నాథ్, గంజి పురుషోత్తమ్, గజవల్లి శ్రీనివాసరావు, శ్రీరాం రమేష్, వంకా హరికృష్ణ, డేగల వెంకటేశ్వర్లు, మల్లెల వేణు, కాటం రామకృష్ణ, తాడి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 29: రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఏపీఎన్‌జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు కూచిపూడి శరత్‌బాబు డిమాండ్ చేశారు. రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులు ఆరోగ్యపరమైన సమస్యలతో అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాకు ఎన్‌జీవో సంఘం మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న డీఆర్ బకాయిలను వెంటనే చెల్లించాలని, 11వ పీఆర్సీ అరియర్స్ చెల్లింపుతోపాటు హెల్త్ కార్డు ద్వారా అన్నిరకాల వ్యాధులకు వైద్యచికిత్సలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ధర్నాకు అధ్యక్షత వహించిన రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ అంకిరెడ్డి మాట్లాడుతూ రిటైర్డ్ అనంతరం ఏమి పనిచేయలేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. హె ల్త్‌కార్డు ద్వారా కేవలం కన్ను, పన్ను రోగాలు మాత్రమే చూస్తున్నారని, అన్ని రకాల వ్యాధులు చూసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

కార్యక్రమంలో ఎన్‌జీవో సంఘం నాయకులు వెంకటేశ్వరరావు, కొత్తపల్లి మంజేష్, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ కంచర్ల సుబ్బారావు, నాయకులు రామమోహన్, డేవిడ్, ఐ. విజయసారథి, పి. సుబ్బారావు, ఎంవీ కృష్ణయ్య, పీఈవీ సుబ్బారావు ఉన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

పోలింగ్ బూత్‌లను పరిశీలించిన సీఐ

బల్లికురవ, జనవరి 29: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలలో ఎలాంటి ఘర్షణలు జరగకుండా ముందస్తు జాగ్రత్తగా సంతమాగులూరు సర్కిల్ సీఐ కె.నరసింహారావు పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. మండలంలోని వల్లాపల్లి, అంబడిపూడి, కొమ్మినేనివారిపాలెం, కొణిదెన మల్లాయపాలెం, వేమవరం, ఉప్పుమాగులూరు, కొప్పెరపాలెం గ్రామాలలో ఉన్న పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. బూత్‌ల వద్ద ఎలాంటి చర్యలు చేపట్టాలన్న దానిపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. అలాగే, ఫ్యాక్షన్ గ్రామమైన వేమవరంలో ఎన్నికల రోజున పటిష్ట చర్యలు చేపడతామని చెప్పారు. అని గ్రామాలలో నిఘా పెంచాలని సీఐ పోలీస్ సిబ్బందికి సూచనలు చేశారు. ఆయన వెంట ఎస్ఐ వి.వేమన, ఏఎస్ఐ బాలకృష్ణ తదితరులు ఉన్నారు.

ఇంటింటికీ కుళాయి అందించే పనులు వేగవంతంచేయాలి

బల్లికురవ, జనవరి 29: జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి కుళాయి అందించే పనులు వేగవంతంగా పూర్తికావాలని ఎంపీడీవో బ్రహ్మయ్య కోరారు. సోమవారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో జలజీవన్ మిషన్ పనులపై పంచాయతీ కార్యదర్శులకు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు జరిగిన శిక్షణలో ఆయన మాట్లాడారు. బల్లికురవ మండలంలోని 21 గ్రామ పంచాయతీలలో ఇంటింటికి కుళాయి కనెక్షన్ అందించేందుకు ప్రభుత్వం ద్వారా రూ.16 కోట్లు మంజురయ్యాయని చెప్పారు. వెంటనే పనులు పూర్తి చేయాలన్నారు. ప్రతిఇంటికి తాగునీరు అందిస్తే ప్రజలు ఆరోగ్య వంతులుగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవిబాబు, ఏఈలు హనుమంతరావు, ఖాశీం, ఈవోపీఆర్డీ సుమతి, తదితరులు పాల్గొన్నారు.

దంతాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం

పేరాల(చీరాలటౌన్), జనవరి 29: దంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని డా.అపర్ణ పేర్కొన్నారు. పేరాల అంకినీడు వారి ఆధ్వర్యంలో సోమవారం ఏఆర్ఎం ఉన్నత పాఠశాలలో ఉచితం దంత సంరక్షణ శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా సుమారు 300 మందికి పరీక్షలు నిర్వహించి బ్రష్, పేస్ట్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానో పాధ్యాయులు సాల్మన్‌రాజు, లయన్స్‌క్లబ్ ఆఫ్ అంకినీడు అధ్యక్షుడు దొంతినేని శ్రీకాంత్, శ్రీనివాస్, ఉదయబాస్కర్, కృష్ణ, సరోజ, పవని భానుచంద్రమూర్తి, రమణారావు, సుందరరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

లారీని ఢీకొన్న కారు.. ఒకరికి గాయాలు

మార్టూరు, జనవరి 29: మార్టూరులోని ప్రభుత్వ ఆస్పత్రి ఎదురు జాతీయ రహదారిపై సోమవారం పాల ట్యాంకర్‌ను వెనుకనుంచి కారు ఢీకొన్న ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. ఈప్రమాదంలో కారులోని ఎయిర్ బెలూన్లు తెరుచుకోవడంతో కారు నడుపుతున్న శ్రీకాంత్ అనే వ్యక్తి స్వల్పగాయాలతో బయటపడ్డారు. గుంటూరు నుంచి అద్దంకికి వెళుతున్న పాల ట్యాంకరును విజయవాడ నుండి ఒంగోలుకు వెళుతున్న కారు ఢీ కొన్నది. కారు ముందుభాగం పూర్తిగా దెబ్బతింది. పోలీసులు విచారణ చేస్తున్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

మార్టూరు, జనవరి 29: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం ఉదయం 11 గంటలకు జరుగుతుందని ఎంపీడీవో నితిన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో జరిగే సమావేశానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

నేటి నుంచి త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు

చీరాల, జనవరి 29: స్థానిక ముంతావారిసెంటర్లోని ఎన్‌వీఎస్ అండ్ ఎస్‌జేఆర్ ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో మంగళవారం నుంచి చైతన్యభారతి సంస్థ ఆధ్వర్యంలో త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు ప్రారంభమవుతాయని సమితి అధ్యక్ష, కార్యదర్శులు డాక్టరు సూర్యదేవర ఉమామోహన్, భాగి నారాయణ శాస్త్రి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ప్రత్యేక పూజలు, నగరోత్సవంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు.

పార్టీ నిర్దేశించిన కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

పంగులూరు, జనవరి 29: ఎన్నికల సమయం దగ్గర పడుతున్నవేళ పార్టీ నిర్దేశించిన ప్రతి కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని టీడీపీ సీనియర్ నాయకుడు, క్లస్టర్ ఇన్‌చార్జ్ కుక్కపల్లి ఏడుకొండలు అన్నారు. టీడీపీ క్లస్టర్ సమావేశాలు మండలంలోని ముప్పవరం గ్రామంలో సోమవారం నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు రావూరి రమేష్ నేతృత్వంలో జరిగిన సమావేశంలో ఏడుకొండలు మాట్లాడుతూ బాబు ష్యూరిటీ, భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమం అన్ని గ్రామాలలో త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. వైసీపీ అరాచక పాలనలో ప్రజలకు జరుగుతున్న నష్టాలను వివరించాలన్నారు. బూత్ కమిటీలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఐటీడీపీ ఇన్‌చార్జ్ రమేష్, వరపర్ల సుబ్బారావు, జగన్మోహన్, అల్లంనేని స్వామి, అశోక్, మురకొండ సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

జలజీవన సంఘాలను ఏర్పాటుచేయాలి

పంగులూరు, జనవరి 29: జలజీవన్ మిషన్ ద్వారా చేపట్టే పనుల నిర్వహణకు గ్రామాలలో జలజీవన సంఘాలను త్వరితగతిన ఏర్పాటుచేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివయ్య కోరారు. సోమవారం పంగులూరు మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో జల జీవన్‌మిషన్ జల కమిటీల ఏర్పాటుకు సంబంధించిన మార్గదర్శకాలపై పలు సూచనలు చేశారు. 11 మంది సభ్యులతో కూడిన కమిటీలో 9 మందిని డ్వాక్రా సంఘాల నుంచి ఎన్నుకోవాలని చెప్పారు. పంచాయతీ కార్యదర్శితో పాటు ఇంజనీరింగ్ అసిస్టెంట్ సభ్యులుగా ఉంటారని తెలిపారు. మండలంలో 25 పనులకు రూ.1498.89 లక్షల నిధులు మంజూరయినట్లు చెప్పారు. ఈ పనులకు సంబంధించి మెటీరియల్ మొత్తం ప్రభుత్వం సరఫరా చేస్తుందని తెలిపారు. కమ్యూనిటీ కాంట్రాక్ట్ కమిటీ నిర్వహిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ రాంబాబు, కార్యాలయ సూపరింటెండెంట్ రమేష్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, కార్యదర్శులు వెలుగు ప్రతినిధి భాస్కరమ్మ, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

విలువైన వస్తువుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

చీరాలటౌన్, జనవరి 29: ప్రతిఒక్కరూ విలువైన వస్తువుల పట్ల అప్రమత్తంగా ఉండాలని చీరాల వన్‌టౌన్ సీఐ శేషగిరిరావు పేర్కొన్నారు. సెల్‌ఫోన్‌లు పోగొట్టుకుని పోలీసులకు ఫిర్యాదుచేసిన ఎనిమిదిమంది యజమానుల ఫోన్‌లను సాంకేతిక సాయంతో గుర్తించి సోమవారం అప్పగించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులు ఖరీదు కలిగిన ఫోన్‌లను వినియోగిస్తున్నట్లు తెలిపారు. ఈక్రమంలో వాటిని జాగ్రత్తగా ఉంచుకోవాలన్నారు. ఎవరైనా వస్తువులను పోగొట్టుకొన్నట్లయితే సరైన పత్రాలతో స్టేషన్‌ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై సుబ్బారావు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

10న నవోదయ ప్రవేశపరీక్ష

ఒంగోలు(విద్య), జనవరి 29 :స్థానిక జవహర్ నవోదయ విద్యాలయంలో 2024-25 విద్యా సంవత్సరంలో 9,11 తరగతుల్లో ప్రవేశానికి వచ్చేనెల 10న ప్రవేశపరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కే రామిరెడ్డి తెలిపారు. ప్రవేశపరీక్షకు సంబంధించి హాల్ టిక్కెట్లు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. కామన్ సర్వీస్ సెంటర్ల ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నవారు ఆసర్వీసు సెంటర్ల ద్వారానే హాల్ టిక్కెట్లుపొందాలన్నారు. జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ కార్యాలయంలో దరఖాస్తు చేసిన వారు ప్రిన్సిపాల్ కార్యాలయంలోనే హాల్ టిక్కెట్లు పొందాలన్నారు. ఈనెల 30నుంచి వచ్చేనెల 6 వరకు ప్రిన్సిపాల్ కార్యాలయంలో పనిదినాల్లో ఉదయం 10 నుం చి సాయంత్రం ఐదుగంటల వరకు దరఖాస్తు రశీదులు సమర్పించి అభ్యర్థులు హాల్ టిక్కెట్లు పొందవచ్చని ఆయన తెలిపారు. వివరాలకు 9481837230, 8638682701 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

ఏకే యూనివర్శిటీ డీన్‌కు అవార్డు

ఒంగోలు(విద్య), జనవరి 29 : స్థానిక ఆంధ్రకేసరి యూనివర్శిటీ సీడీసీ డీన్ డాక్టర్ డి.వెంకటేశ్వరరెడ్డి జాతీయ సమైక్యతా అవార్డును అందుకున్నారు. విజయవాడలోని లయన్స్ ఇంటర్నేషనల్, ఎక్సలే సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో 2024 సంవత్సరానికి జాతీయ సమైక్యతా అవార్డును వెంకటేశ్వరరెడ్డికి ప్రకటించారు. దేశభక్తి, జాతీయ సమైక్యతను పెంపొందించిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, కొండ వెంకటప్పయ్య, ప్రకాశం జిల్లా జాతీయ ఉద్యమత్యాగమూర్తులు వంటి రచనలు చేసినందుకు వెంకటేశ్వరెడ్డిని ఈ అవార్డుకు ఎంపిక చేశారు. విజయవాడలో జరిగిన కార్యక్రమంలో మాజీమంత్రి, ఎమ్మెల్సీ డాక్టర్ డొక్కా మాణిక్యవరప్రసాద్ చేతుల మీదుగా వెంకటేశ్వరరెడ్డి ఈ అవార్డును అందుకున్నారు. ఇప్పటి వరకు 35కు పైగా జాతీయ, అంతర్జాతీయ వ్యాసాలను ప్రచురించడంతో పాటు ఏడు జాతీయ సదస్సులను నిర్వహించారు.

ఖాళీ ఉపాధ్యాయ పోస్టులను భర్తీచేయాలి

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 29: రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 50వేల ఉపాధ్యాయ పోస్టులను ప్రభుత్వం వెంటనే భర్తీ చేయాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి చొప్పర సిసింద్రిబాబు ఒక ప్రకటనలో డిమాండ్‌చేశారు. నాలుగేళ్ళ నుంచి ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయకుండా ఇప్పుడు ఎన్నికల సమయం సమీపిస్తుండటతో ప్రభుత్వం హడావుడి చేస్తుందని ఆరోపించారు. ప్రభుత్వం టెట్ లేకుండా నేరుగా డీఎస్సీ నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.